



Truth of News

PRGI Reg No: APTEL/26/A4782

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 01 | సంచిక : 352 | ఆదివారం 12 జూలై 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi




## వెనిజులాలో జంట భూకంపాలు..

### - 4వేలు దాటిన మరణాలు

వెనిజులా - సూర్య వాస్తవం

వెనిజులాలో జూన్ 24న సంభవించిన వరుస భూకంపాలు బీభత్సం సృష్టించాయి. ఈ ప్రకృతి విపత్తులో మరణాల సంఖ్య 4,118కు చేరినట్లు వెనెజువెలా ప్రభుత్వం వెల్లడించింది. వేలాది మంది గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. సహాయక బృందాలు శిథిలాల మధ్య నిరంతరం సహాయక చర్యలు కొనసాగిస్తుండగా, గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగుతోంది. భూకంపాల కారణంగా భారీ స్థాయిలో భవనాలు కూలిపోవడంతో పాటు మౌలిక సదుపాయాలు ధ్వంసమై, లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు.

# విహారయాత్రలో విషాదం

- వియత్నాంలో పడవ బోల్తా
- 15 మంది భారతీయులు మృతి
- చనిపోయిన వారిలో తెలుగు రాష్ట్రాల వాసులు

హనోయ్ - సూర్య వాస్తవం



వియత్నాం పర్యటనకు వెళ్లిన భారతీయులకు ఊహించని విషాదం ఎదురైంది. ఫూ క్వాక్ ద్వీపం సమీపంలో వీరు ప్రయాణిస్తున్న స్పీడ్ బోటు బోల్తా పడింది. ఈ ఘటనలో 15 మంది పర్యాటకులు మృతి చెందారు. వీరిలో తెలుగు రాష్ట్రాల వాసులున్నారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఓ మొబైల్ కంపెనీ భారత్ నుంచి తమ డిస్ట్రిబ్యూటర్ల కుటుంబాలను వియత్నాం ట్రిప్‌నకు తీసుకెళ్లింది. మొత్తం 250 మంది ఈ యాత్రకు వెళ్లారు. వీరిలో తెలంగాణ నుంచి 40 మంది ,ఏపీ నుంచి 35 మంది ఉన్నారు. ట్రిప్‌లో భాగంగా వీరు మూడు పడవల్లో సముద్రంలో విహార యాత్రకు వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో హాన్ మే రుట్ నుంచి అన్‌థోయ్ పోర్టుకు ఒక స్పీడ్ బోట్ బయల్దేరింది. అందులో 32 మంది భారతీయు లు, నలుగురు సిబ్బంది ఉన్నారు. ఈ పడవ తీరానికి 400 మీటర్ల దూరంలో ఉండగా.. సముద్రంలో ఒక్కసారిగా బోల్తా పడింది. దీంతో ప్రయాణికులు

- మిగతా 2లో..

# షాబాద్‌లో రక్తపాతం

- పోక్సో కేసు పెట్టారన్న కక్షతో ఆరుగురి హత్య
- బాధిత బాలిక, ఆమె తల్లి, నాయనమ్మ, నిందితుడి భార్య, ఇద్దరు చిన్నారులను చంపిన వైనం
- పోలీసుల నిర్లక్ష్యమే కారణమంటూ షాబాద్‌లో గ్రామస్తుల ఆందోళన
- బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వచ్చిన ప్రతిపక్ష నేతల అడ్డగింత
- నిందితున్ని కఠినంగా శిక్షిస్తాం : జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

షాబాద్- సూర్య వాస్తవం




రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో శనివారం తెల్లవారుజామున రక్తపాతం జరిగింది. ఓ దుర్మార్గుడు సృష్టించిన నరమేధంతో రాష్ట్రం ఉలిక్కిపడింది. తనపై పోక్సో కేసు పెట్టారన్న కక్ష?తో దుండగుడు.. బాధిత బాలిక, ఆమె తల్లి, నాయనమ్మతో పాటు అతని భార్య, ఇద్దరు చిన్నారులు ఇలా మొత్తం ఆరుగురుని హత్య చేశాడు. ఈ ఘటన రెండు గ్రామాలను విషాదంలో ముంచేసింది. పోక్సో కేసులో నిందితున్ని అరెస్టు చేయకుండా, జైలుకు పంపకుండా పోలీసులు నిర్లక్ష్యం చేయడం.. బాధిత బాలిక కుటుంబానికి రక్షణ కల్పించకపోవడంతోనే దుండగుడు ఈ మారణహోమం సృష్టించా డంటూ గ్రామస్తులు

- మిగతా 2లో..



## ప్రధాని మోడీ విలేకరుల సమావేశాలెందుకు పెట్టరు?

- నిలదీసిన న్యూజిలాండ్ జర్నలిస్ట్
- నార్వే పర్యటనలోనూ ఎదురైన ఇదే ప్రశ్న

2లో



## పార్లమెంట్ మార్చ్‌లో పాల్గొంటూ

- సీజేపీ, వాంగ్‌చుక్‌కు నటుడు ప్రకాశ్‌రాజ్ మద్దతు
- సీపీఐ(ఎం) నేతలు జితేంద్ర చౌదరి, థామస్ ఐజాక్ సంఘీభావం

2లో

# జనంతోనే అభివృద్ధి, జనాభా ఉంటేనే భవిష్యత్తు

- విజయవాడలో జరిగిన కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరు
- జనాభా నియంత్రణ నుంచి సంరక్షణ వైపు ప్రభుత్వ విధానం
- 'పిల్లలే సంపద' పేరుతో కొత్త కార్యక్రమానికి నాంది
- యువత నైపుణ్యం, వృద్ధుల అనుభవం దేశానికి ఆస్తి అన్న సీఎం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన మార్పుపై సంకేతం
- మైక్రో కుటుంబాల కన్నా ఉమ్మడి కుటుంబాలే మేలని వ్యాఖ్య

విజయవాడ- సూర్య వాస్తవం:




ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర జనాభా విధానంపై ఒక సంచలనాత్మక, కీలక ప్రకటన చేశారు. ఇప్పటివరకు ప్రభుత్వాలు అనుసరించిన 'జనాభా నియంత్రణ' విధానానికి స్వస్తి పలికి, 'జనాభా సంరక్షణ' అనే కొత్త దిశగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టం చేశారు. "జనంతోనే అభివృద్ధి, జనాభా ఉంటేనే భవిష్యత్తు" అనే నినాదాన్ని ఇస్తూ, భవిష్యత్తులో 'పిల్లలే సంపద' అనే మాటను నిజం చేసి చూపిస్తామని ఆయన ప్రకటించారు. విజయవాడలో నేడు (జులై 11) జరిగిన ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గతంలో ప్రభుత్వాలు జనాభా నియంత్రణ కోసం అనేక కార్యక్రమాలు చేపట్టాయని, అందులో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు ఉన్నవారిని అనర్హులుగా ప్రకటించే నిబంధనలు కూడా తెచ్చామని చంద్రబాబు గుర్తుచేశారు. అయితే, ప్రస్తుతం మారిన పరిస్థితులకు అనుగుణంగా ఆ విధానాలను మార్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు. "దేశమంటే మట్టి కాదోయ్-దేశమంటే

- మిగతా 2లో..



## ఎస్. జానకి ఇక లేరు

- దక్షిణ భారతదేశపు గాన కోకిల మైసూరులో కన్నుమూసింది!

మైసూరు- సూర్య వాస్తవం

దక్షిణ భారతదేశపు కోకిలగా ప్రసిద్ధి చెందిన ప్రముఖ గాయని ఎస్. జానకి కన్నుమూశారు. ఆమె వయస్సు 88 సంవత్సరాలు. దక్షిణఆసియన్ల ఢ దయా స్పోరా అనారోగ్యం కారణంగా అతడిని మైసూరులోని అపోలో ఆసుపత్రిలో చేర్చారు. అయితే, చికిత్స అందకపోవ డంతో అతను మరణించాడు. గుండె పోటుతో అతను

- మిగతా 2లో..




## పోలీసులు ఒప్పందాలు, నేరాలలో పాలుపంచుకోకూడదు

- లంచాలు ఇచ్చి శాఖలో చేరకూడదు
- ఇది మన పోలీస్ విభాగానికి కొత్త బలాన్ని చేకూరుస్తోంది.
- సరిహద్దు వద్ద ఒక సైనికుడు, సరిహద్దు లోపల ఒక పోలీస్.
- వీరిద్దరితో మన రాష్ట్రం, దేశం శాంతియుతంగా జీవించగలవు.
- విధానసౌధలో జరిగిన కార్యక్రమంలో సీఎం డీకే శివకుమార్

బెంగళూరు- సూర్య వాస్తవం:

ఏ పోలీసు అధికారి కూడా ఒప్పందాలు, నేరాలలో పాలుపంచుకోకూడదు. ఒకవేళ అలాంటి విషయాలలో ప్రమేయం ఉంటే, కఠిన చర్యలు తీసుకుంటాం. దయచేసి దీనిని నా అభ్యర్థనగా, హెచ్చరికగా అర్థం చేసుకోండి అని సీఎం డీకే శివకుమార్ అన్నారు. శనివారం విధాన సౌధ ప్రాంగణంలో రాష్ట్ర జిల్లా యూనిట్లకు 32 అత్యాధునిక మొబైల్ ఫోరెన్సిక్ వ్యాన్‌లు, 75 బొలెరో వాహనాలను అంకితం చేసే కార్యక్రమం సందర్భంగా శివకుమార్ ప్రసంగించారు. డ్రగ్స్ ముఠాను ఛేదించిన పోలీసు బృందానికి రూ.10 లక్షల నగదు బహుమతి

- మిగతా 2లో..

# ఎన్డీఎస్ఏనే ఫైనల్

- ఆ సూచనలే అమలు చేస్తాం
- వారు ఆమోదిస్తే మేడిగడ్డను ఈటలకు అప్పగిస్తాం...
- గేట్లు దించకుండా కన్నెపల్లిలో నీరెత్తిపోయడం అసాధ్యం
- కాళేశ్వరంలో రిటైర్డ్ ఇంజినీర్లను జైళ్లకు పంపలేదు... అందుకే తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- బీఆర్ఎస్ హయాంలోనే పట్టిసీమ నిర్మాణం హరీశ్‌రావు అప్పుడెందుకు అడ్డుకోలేదు?
- కాళేశ్వరంపై బీఆర్ఎస్ దుష్ప్రచారం
- సీబీఐ విచారణ కోరాం...కేంద్రం స్పందించదేం? : సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్

హైదరాబాద్- సూర్య వాస్తవం



కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సూచనలే ఫైనల్ అనీ, రాష్ట్ర ప్రభుత్వం వాటినే అమలు చేస్తుందని సీఎం ఏ రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఎన్డీఎస్ఏను కలిసి నీళ్లు ఎత్తిపోయాలని కోరితే, సంపూర్ణంగా సహకరిస్తామన్నారు. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోసే బాధ్యతను ఆయనకే అప్పగిస్తామని చెప్పారు. మాజీ మంత్రి టీ హరీశ్‌రావు మాటలనే ఈటల రాజేందర్ వల్లె వేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ ఎంపీ బీఆర్ఎస్‌కు ఎందుకు దగ్గరవుతున్నారో అర్థం చేసుకోవాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సాంకేతిక అంశాలపై కనీస అవగాహన లేకుండా మాట్లాతున్నారని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ) లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి సీఎం మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ,

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# విహారయాత్రలో విషాదం

(మొదటిపేజీ తరువాయి)

నీటిలో టీఎం థామస్ ఐజాక్ సంఘీభావం తెలిపారు. సీజేపీ(కాక్రోచ్ జనతా పార్టీ) కొనసాగిస్తున్న ఆందోళన శనివారం నాటికి 22 రోజులు పూర్తి చేసుకుంది. అలాగే సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా త్రిపుర ప్రతిపక్ష నేత, సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు జితేంద్ర చౌదరి, కేరళం ఆర్థిక మునిగిపోయారు. ప్రమాదం జరిగిన వెంటనే గమనించిన సమీపంలోని ఇతర పర్యాటక బోట్ల నిర్వాహకులు.. అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే, బోటు పూర్తిగా తలకిందులు కావడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడినట్టు స్థానిక అధికారులు వెల్లడించారు. అటు అలల ఉద్ధృతి కూడా తీవ్రంగా ఉండటంతో టూరిస్టులను కాపాడటం కష్టంగా మారింది. వీరిలో కొందరిని రెస్క్యూ సిబ్బంది రక్షించి ఆస్పత్రికి తరలించారు. మరికొందరు గల్లంతవ్వగా వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. వాతావరణ మార్పుల కారణంగానే బోటు మునిగినట్టు తెలుస్తోంది. ఈ ప్రమాదంపై వియత్నాంలోని భారత ఎంబసీ స్పందించింది. సహాయక చర్యలు కొనసాగుతున్నట్టు తెలిపింది. బాధితుల కోసం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్టు పేర్కొంది. బోల్తా పడిన బోటులో ప్రయాణించిన 32 మంది ప్రయాణికుల జాబితాను భారత రాయబార కార్యాలయం విడుదల చేసింది. మృతి చెందిన వారిలో ఏపీలోని కడప జిల్లాకు చెందిన డిస్ట్రిబ్యూటర్ శ్రీధర్, మచిలీపట్నంకు చెందిన జయశ్రీ ఉన్నారు. కడపకు చెందిన మరో డిస్ట్రిబ్యూటర్ నయీం ఒడ్డున ఉండటంతో ప్రాణాలు దక్కించుకున్నారు.

# ప్రధాని మోడీ విలేకరుల సమావేశాలెందుకు పెట్టరు?

**ఆక్లాండ్ – సూర్య వాస్తవం**

భారతీయ దౌత్య వేత్తలతో జరిగిన సంభాషణలో ప్రధాని మోడీ విలేకరుల సమావేశాలు నిర్వహించ కపోవడంపై న్యూజిలాండ్ జర్నలిస్ట్ ఒకరు ప్రశ్న లేవనెత్తారు. ద్వైపాక్షిక సంబంధా లను బలోపేతం చేయడం, రెండు దేశాల మధ్య సహకారాన్ని విస్తరించడంపై దృష్టి సారించిన మోడీ మూడు దేశాల పర్యటన లో భాగంగా చివరి దశలో న్యూజిలాండ్ పర్యటనకు వెళ్ళినప్పుడు ఆయనకు ఊహించని విధంగా ఈ ప్రశ్న ఎదురైంది. దీనికి స్పందిస్తూ, విదేశీ వ్యవహారాల శాఖ అధికారి రుద్రేంద్ర టాండన్ మాట్లాడారు. ప్రధాని రాజకీయ విధానంపై వ్యాఖ్యానిం చడం తన పరిధిలోని అంశం కాదన్నారు. "ఒక ప్రభుత్వం తరఫున ప్రతినిధి అయిన మోడీ రాజకీయ పద్ధతిని ప్రశ్నించడం తగదు" అని పేర్కొన్నారు. అంతేకాక మోడీ సంభాషణా శైలిని వివరిస్తూ, మధ్య వర్తుల ద్వారా కాకుండా ఓటర్లతో నేరుగా సంభాషించడానికి ఇష్టపడే నాయకుడిగా టాండన్ ఆయనను అభివర్ణించారు.

**నార్వే జర్నలిస్ట్ వివాదం**

నార్వే పర్యటనలోనూ మోడీకి ఇలాంటి ప్రశ్నే ఎదురైంది. మే నెలలో ఓస్లోలో నార్వే ప్రధాని జోనాస్ గహర్ స్టోర్‌తో కలిసి మీడియా ముందుకు వచ్చినప్పుడు, జర్నలిస్ట్ హెల్లె లింగ్ అక్కడి నుండి వెళుతున్న మోడీని ఉద్దేశించి, జర్నలిస్టుల ప్రశ్నలకు ఎందుకు సమాధానం ఇవ్వరని అడిగారు. ఆ ప్రశ్నకు ప్రధాని స్పందించలేదు. అయితే, ఆ ఘటనపై మీడియాలోని కొన్ని వర్గాలలో , సోషల్ మీడియాలో చర్చ జరిగింది. ఏప్రిల్‌లో భారత్, న్యూజిలాండ్ లు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంత కం చేసిన కొన్ని నెలల తర్వాత ఈ పర్య టన జరిగింది. 2025 మార్చిలో న్యూజి లాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ భారత పర్యటన సందర్భంగా మోడీ, లక్సన్‌ల మధ్య జరిగిన ద్వైపాక్షిక చర్చల అనం తరం ఈ ఒప్పందం కుదిరింది. ఇరు పక్షాలు ఆర్థిక, వ్యూహాత్మక సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవాలని కోరుకుంటున్నాయి. కాగా 2026 వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్‌లో 180 దేశాలలో భారతదేశం ప్రస్తుతం 157వ స్థానంలో ఉంది.

# ఎస్. జానకి ఇక లేరు

(మొదటిపేజీ తరువాయి)

మరణించినట్లు వర్గాలు తెలిపాయి. మైసూరులో నివసిస్తున్న ఎస్. జానకిని నవీన్ అనే సంరక్షకుడు చూసుకుంటున్నాడు. అతనికి ఈ సాయంత్రం అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో వెంటనే ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు, కానీ అతను చికిత్సకు స్పందించకుండా తుదిశ్వాస విడిచాడని సమాచారం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా, రేపల్లె గ్రామంలో 1938 ఏప్రిల్ 23న జన్మించిన ఎస్. జానకి, మూడేళ్ల వయసులో నాదస్వర గురువు శ్రీ పైడిస్వామి వద్ద తన సంగీత అధ్యయనాన్ని ప్రారంభించారు.

1957లో, ప్రముఖ సంగీత దర్శకుడు టి. చలపతి రావు గారి తమిళ చిత్రం 'విధియిన్ విలయట్టు'లో జానకి మొదటిసారిగా పాట పాడారు. ఆ తర్వాత, తెలుగు చిత్రం 'ఎం.ఎల్.ఏ.', కన్నడ చిత్రం 'కృష్ణగారుడి'లలో వరుసగా పాటలు పాడారు. ఆమె మలయాళ చిత్రాలలో కూడా పాడటం ప్రారంభించారు. ఈ విధంగా, ఆమె తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం సహా 20కి పైగా భాషలలో 48,000కు పైగా పాటలు పాడి సినీ ప్రేక్షకులను అలరించారు. ఆమె దక్షిణ భారతదేశంలోని అన్ని ప్రధాన భాషలలో గాయనిగా ఎదిగి, హిందీతో సహా అనేక భారతీయ భాషలకు తన మధురమైన గాత్రాన్ని అందించారు.

# పోలీసులు ఒప్పందాలు, నేరాలలో పాలుపంచుకోకూడదు

(మొదటిపేజీ తరువాయి)

లభించింది. ఇది మన పోలీసు విభాగానికి కొత్త బలాన్ని ఇస్తోంది. సరిహద్దులో సైనికులు, సరిహద్దు లోపల పోలీసులు. వీరిద్దరి వల్లే మన రాష్ట్రం, దేశం శాంతియుతంగా జీవించగలుగుతున్నాయి. ప్రభుత్వం తరఫున మీకు అభినందనలు. మీ సామర్థ్యానికి మించిన లక్ష్యాలను నిర్దేశించుకున్నప్పుడు విజయం మీదే అవుతుంది, అని ఆయన అన్నారు. మన పోలీసులు ఏడాదిలో రూ. 375 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసు శాఖ అధికారులు 1500 మంది మాదకద్రవ్యాల వ్యాపారులను అరెస్టు చేశారు, ఇది ఒక పెద్ద రికార్డు. యావత్ దేశం కర్ణాటక వైపు చూస్తోంది. మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌ను ఛేదించిన బృందానికి ప్రభుత్వం రూ. 10 లక్షల నగదు బహుమతిని ఇవ్వాలని నిర్ణయించింది. అధికారులందరికీ నా అభినందనలు. ప్రతి పౌరుడు శాఖకు గౌరవం తెచ్చేందుకు కృషి చేయాలి. మీ విజయం ప్రభుత్వ విజయమే అని ఆయన అన్నారు. ఇటీవల కేరళ హోం మంత్రి రమేష్ చెన్నితాల నన్ను కలిసి, కేరళ సరిహద్దు గుండా కర్ణాటక సరిహద్దులోకి ఎలాంటి మాదకద్రవ్యాలు రాకుండా చూడాలని కోరుతూ కొంత సమాచారం ఇచ్చారు. మా రాష్ట్రంలోకి మాదకద్రవ్యాలు ప్రవేశించకుండా అడ్డుకుంటామని నేను ఆయనకు హామీ ఇచ్చాను, అని ఆయన అన్నారు.

మన పోలీస్ శాఖ దేశంలోనే అత్యంత సమర్థవంతమైన శాఖగా పేరుగాంచింది. పోలీసు సిబ్బంది యొక్క కఠోర శ్రమ, నిబద్ధత, పనితీరు వల్లే ఈ పేరు వచ్చింది. మీకు సేవ చేయడానికి ప్రభుత్వం రేయింబవళ్లు అండగా ఉంటుంది. కొన్నిసార్లు విపత్తులు సంభవిస్తాయి. అటువంటి పరిస్థితులలో కూడా మీ మనోధైర్యం తగ్గకుండా నేను, మన ప్రభుత్వం భరోసా కల్పించాము. మీరు చట్టాన్ని నిలబెట్టి, సమాజ ప్రయోజనాలను కాపాడతారు. నేరాలు అనేక రూపాల్లో ఉంటాయి. సాంకేతికత, ఏఐ రాకతో నేరాలను గుర్తించడానికి ఎన్నో చర్యలు తీసుకున్నాం. గూండాయిజాన్ని అరికట్టడానికి అన్ని పోలీస్ స్టేషన్లలో ఒక దళాన్ని ఏర్పాటు చేయాలని నేను ఆదేశించాను," అని ఆయన అన్నారు.

# షాబాద్‌లో రక్తపాతం

(మొదటిపేజీ తరువాయి)

ఆందోళనకు దిగారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

ఓ బాలికపై లైంగిక వేధింపుల కేసులో దైవాలగూడకు చెందిన రాజ్‌కుమార్‌పై మే16న పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. అనంతరం అతడు బెయిల్ పొందాడు. తనపై కేసు నమోదు చేయించారనే కక్షతో శనివారం తెల్లవారుజామున షాబాద్ పీఆర్ఆర్ స్టేడియం సమీపంలోని బాలిక ఇంట్లోకి చొరబడ్డాడు. ముందుగా తనపై ఫిర్యాదు చేసిన చిట్యాల లక్ష్మి(45), ఆమె అత్త రుక్కమ్మ (65)ను కత్తితో పొడిచి హత్య చేశాడు. ఆ తర్వాత బాలిక(17)ను దైవాలగూడ సమీపంలోని చెరువు వద్దకు తీసుకెళ్లి హత్య చేశాడు. అదే ఇంట్లో ఉన్న లక్ష్మీ పెద్ద కూతురు మానసిక వికలాంగురాలైన మేఘనను వదిలేశాడు. ఆ తర్వాత తన ఇంటికి వెళ్లి భార్య సరిత(30), ఇద్దరు పిల్లలు పరీక్ష?త్(4), దైవిక్ష?త్ (2)ను కత్తితో పొడిచి చంపాడు. అనంతరం పారిపోయాడు. కొంత దూరం వెళ్లాక.. తన తండ్రికి ఫోన్ చేసి ఆరుగురిని హత్య చేశానని, తాను ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. అతను వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలాలకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల, ఉస్మానియా ఆస్పత్రులకు తరలించారు. నింది తుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. నిందితుడు సరితను ప్రేమ వివాహం చేసుకున్నాడు.

**ఉన్నతాధికారుల పర్యవేక్షణ**

ఘటనా స్థలాన్ని ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి సందర్శించి, పరిస్థితిని సమీక్షించారు. జాయింట్ సీపీ చందనా దీప్తి, చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్, షాద్‌నగర్ డీసీపీ శిరీష, ఏసీపీ లక్ష్మీనారాయణ, ఇతర పోలీసు అధికారులు, క్లూస్ టీం సభ్యులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చేవెళ్ల ఆర్డీవో పార్థసారథి రెడ్డి కూడా ఘటనా స్థలాన్ని సందర్శించారు.

**పోలీసుల నిర్లక్ష్యంపై ఆగ్రహం**

పోక్సో కేసు నమోదైనప్పటికీ నిందితుడిపై తగిన నిఘా పెట్టలేదని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు షాబాద్ ప్రధాన చౌరస్తాలో రాస్తారోకో చేశారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితుడికి కఠిన శిక్ష పడే వరకూ ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు. రాస్తారోకోలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పట్నం అవినాష్ రెడ్డి, బర్క కృష్ణ, రాము, తమ్మలి రవీందర్, వెంకట్ యాదవ్, జడల రాజేందర్ గౌడ్, రాహుల్ గుప్తా, దేవేందర్ రెడ్డి, గౌరీ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. బాధిత కుటుంబ సభ్యుల రోదనలతో షాబాద్ చౌరస్తా హృదయ విదారకంగా మారింది.

**నిందితులను కఠినంగా శిక్షిస్తాం : జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి**

నిందితుడు ఆరుగురిని హత్య చేయడం ఎంతో దురదృష్టకరమని, నిందితున్ని కఠినంగా శిక్ష?ంచి బాధితులకు న్యాయం చేస్తామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. తక్షణ సహాయంగా బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు ప్రకటించారు. మానసిక వికలాంగురాలు మేఘనను ఆదుకుంటామని తెలిపారు. ఆమెకు రెండు పడకల గదిని నిర్మించి ఇస్తామని, అన్ని రకాలుగా సౌకర్యాలు సమకూర్చి వసతి గృహంలో ఉండేలా ప్రభుత్వం నుంచి హామీ ఇస్తున్నట్టు తెలిపారు. పోక్సో కేసులో నిర్లక్ష్యం వహించిన పోలీసులపై చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో శాంతించిన బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు రాస్తారోకో విరమించారు.

**ప్రతిపక్ష నేతల అడ్డగింత**

బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు బయలుదేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని పోలీసులు చేవెళ్లలోనే అడ్డుకున్నారు. ఘటనా స్థలానికి వారు వెళ్లేందుకు అనుమతి నిరాకరించారు. దాంతో కొద్దిసేపు బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అక్కడ స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. చివరికి పోలీసులు బీఆర్ఎస్ నేతలను అదుపులోకి తీసుకుని చేవెళ్ల పీఎస్‌కు తరలించారు.

**షాబాద్ ఎస్ఐపై సస్పెన్షన్, సీఐపై విచారణ**

పోక్సో కేసు నిందితుడు రాజ్‌కుమార్‌పై సకాలంలో తగిన చర్యలు తీసుకోకపోవడంతోపాటు విధుల్లో నిర్లక్ష్యం వహించిన షాబాద్ ఎస్ఐ రమేష్‌ను సస్పెండ్ చేసినట్టు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. అలాగే, సీఐ కాంతారెడ్డిపై శాఖాపరమైన విచారణకు ఆదేశించినట్టు వెల్లడించారు.

**నిందితుడి ఆచూకీ తెలిపితే రూ.2 లక్షల రివార్డు**

ఆరు హత్యలు చేసి పరారీలో ఉన్న నింది తుడు రాజ్‌కుమార్ ఆచూకీ తెలిపినా.. పట్టిం చేందుకు సహకరించిన వారికి రూ.2లక్ష?ల రివార్డు అందజేస్తామని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి ప్రకటించారు. సమాచారం అం దించిన వ్యక్తి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు, వారి భద్రతకు పూర్తి హామీ ఇస్తామని చెప్పారు. నిందితుడి గురించి ఏవైనా వివరాలు తెలిసిన వారు చేవెళ్ల పోలీస్ కంట్రోల్ రూమ్ 87126 65324 నంబర్‌కు ఫోన్ కాల్ లేదా వాట్సప్ ద్వారా సమాచారం అందించొచ్చని సూచించారు. నిందితుడి కోసం ఇప్పటికే ఏడు ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయని తెలిపారు. త్వరలోనే అరెస్టు చేసి చట్టం ముందు నిలబెడతామన్నారు. ప్రజలు వదంతులను నమ్మొద్దని, శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతమూ కలగకుండా బాధ్యతా యుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

# పార్లమెంట్ మార్చ్‌లో పాల్గొంటా

**- సీజేపీ, వాంగ్‌చుక్‌కు నటుడు ప్రకాశ్‌రాజ్ మద్దతు**
**- సీపీఐ(ఎం) నేతలు జితేంద్ర చౌదరి, థామస్ ఐజాక్ సంఘీభావం**

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం**

నీట్ ప్రశ్నాపత్రం లీక్, సీబీఎస్ఈలో అవకతవకలతో పాటు విద్యా రంగ వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తోన్న సీజేపీకి, నిరవధిక నిరాహార దీక్ష? కొనసాగిస్తున్న పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ కు నటుడు ప్రకాష్ రాజ్ మద్దతు తెలిపారు. సీపీఐ(ఎం) నేతలు జితేంద్ర చౌదరి, శాఖ మాజీ మంత్రి టీఎం థామస్ ఐజాక్ జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న ఆందోళన వద్దకు చేరుకున్నారు. విద్యార్థులు, యువత చేపట్టే ఈ ఆందోళనకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. అలాగే నిరాహార దీక్ష చేస్తోన్న పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను కలిసి తమ సంఘీభావాన్ని తెలిపారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే దీక్ష?లో పాల్గొన్న విద్యార్థి సంఘ నేతలకూ తమ సంఘీభావాన్ని తెలిపారు. అనంతరం సీపీఐ(ఎం) నేత జితేంద్ర చౌదరి మాట్లాడుతూ దేశంలోని విద్యావ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని ఆందోళన చేస్తున్న సీజేపీకి, సోనమ్ వాంగ్‌చుక్ కు సంఘీభావంగా నిలుస్తున్నట్టు తెలిపారు. విద్యార్థుల్లో , వారి తల్లిదండ్రుల్లో అసంతృప్తికి ఈ ఆందోళనే నిదర్శనమని థామస్ ఐజాక్ అన్నారు. ఈ నెల 20న జరిగే సీజేపీ నిర్వహించే పార్లమెంట్ మార్చ్‌లో పాల్గొననున్నట్టు ప్రకాశ్ రాజ్ ప్రకటించారు. అదేవిధంగా జంతర్‌మంతర్‌లోని ఎస్ఎఫ్ఐ క్రాంతి కార్నర్‌నూ నాయకులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు నరేష్ జమాథియా, కృష్ణ రక్షిత్, డీవైఎఫ్ఐ అఖిల భారత ప్రధాన కార్యదర్శి హిమగ్నరాజ్ భట్టాచార్య, ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు ఆదర్శ్ ఎం సాజీ, ఉపాధ్యక్షుడు సుభాష్ జాఖద్, ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి ఐషీ ఘోష్, అధ్యక్షుడు సూరజ్ ఇలామాన్ పాల్గొన్నారు.

**నేను గాంధీని కాదు, హీరోని కాదు.. సాధారణ పౌరుడినే : సోనమ్ వాంగ్‌చుక్**

'నేను గాంధీని కాదు, హీరోని కాదు నా బాధ్యతలను నెరవేర్చడానికి ప్రయత్నించిన ఓ సాధారణ పౌరుడిని మాత్రమే' అని పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ అన్నారు. సోషల్ మీడియాలో తన ఉద్యమానికి మద్దతు ఇస్తున్నందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగాట ఆయన మాట్లాడుతూ "చాలా మంది నన్ను 21వ శతాబ్దపు గాంధీ లేదా ఆధునిక గాంధీ అని పిలుస్తున్నారు. మరికొందరు హీరో అని పిలుస్తున్నారు. ఈ వ్యాఖ్యలు నాకు అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. నేను ఒక సాధారణ పౌరుడిని మాత్రమే" అని అన్నారు. "దయచేసి ఇతరులలో హీరో కోసం వెతకకండి. మీ జీవితానికి మీరే హీరో అవ్వండి. పౌరులుగా మీ బాధ్యతలను నెరవేర్చండి" అని చెప్పారు.

# ఎన్డీఎస్ఏనే ఫైనల్

(మొదటిపేజీ తరువాయి)

అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నీరు నింపకూడదని ఎన్డీఎస్ఏ స్పష్టంగా చెప్పిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ చెబుతున్నట్టు పారుతున్న నీళ్లను ఎత్తిపోసే అవకాశం ఉంటే అసలు బ్యారేజీలు కట్టే అవసరమేంటని ప్రశ్నించారు. బ్యారేజీలు కట్టడం అంటేనే పారుతున్న నీళ్లను నిలిపి, వాటిని ఎత్తిపోయాల్సి ఉంటుందని వివరించారు. కన్నెపల్లి దగ్గర ఎత్తిపోతలకు అవకాశమే లేదన్నారు. ప్రాజెక్టు పునరుద్ధరణపై ఎవరెన్ని తప్పుడు ప్రచారాలు చేసినా రాష్ట్ర ప్రభుత్వం ఎన్డీఎస్ఏ కమిటీ సూచనల ప్రకారమే ముందుకెళుతుందని తేల్చిచెప్పారు. వాస్తవాలను పక్కనబెట్టి బీజేపీ, బీఆర్ఎస్‌లు ప్రజా ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టేందుకు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు మతి భ్రమించి మాట్లాడుతున్నారనీ, ఆయన కమిషన్ల సంగతి తెలిసే గతంలో కేసీఆర్ క్యాబినెట్‌లో చేర్చుకోకుండా పక్కన బెట్టారని ఆరోపించారు. అనేక విషయాల్లో ఆంధ్రా సంస్థలంటూ విమర్శించే హరీశ్‌రావు ఇప్పుడు నారాయణ, చైతన్య సంస్థలకు పాలు పోసి బతుకుతు న్నారని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీఆర్ఎస్ హయాంలో పట్టిసీమను నిర్మించిందని గుర్తుచేశారు. ఆ ప్రాజెక్ట్ ద్వారా ఏపీకి 105 టీఎంసీల నీటిని తరలించుకెళ్లినప్పుడు అప్పటి మంత్రి హరీశ్‌రావు ఏం చేశా రని ప్రశ్నించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వినియోగంలోకి వస్తే పోలవ రానికి నీళ్లు పోవని చెప్పగలరా అని అడిగారు. బీఆర్ఎస్, బీజేపీలు తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. తెలంగాణ వాదం ముసుగు లో కొంతమంది రిటైర్డ్ ఇంజినీర్లు మేడిగడ్డ నుంచి నీరు ఎత్తిపోయ డంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఆ ప్రాజెక్టు పాపంలో భాగ స్వాము లు అయిన ఇంజినీర్లను జైళ్లకు పంపకపోవడం వల్లే అడ్డగోలు మా టలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డపై శ్యాం ప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో కేసీఆర్ వేసిన కమిటీ కూడా అక్కడ బ్యారేజీ నిర్మిం చడం సాధ్యం కాదని చెప్పిందని గుర్తు చేశారు. ఇప్పుడు అదే రిటైర్డ్ ఇంజి నీర్లు రైతులను తప్పుదోవ పట్టిస్తూ, బీఆర్ఎస్‌కు వంతపాడుతున్నారని అన్నారు. ?

**సీబీఐ విచారణ కోసం ఒత్తిడి తెస్తాం**

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జస్టిస్ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా సీబీఐ దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరితే, ఇప్పటి వరకు ఎందుకు పట్టించుకోలేదని సీఎం నిలదీశారు.

# జనంతోనే అభివృద్ధి, జనాభా ఉంటేనే భవిష్యత్తు

(మొదటిపేజీ తరువాయి)

మనుషులోయ్ అని గురజాడ చెప్పిన మాటల్ని మరోసారి గుర్తు చేసుకోవాలి. జనాభా నియంత్రణ కాదు, జనాభా సంరక్షణ కార్యక్రమాల్ని ప్రభుత్వం చేపడుతుంది. గతంలో మహిళల్లో అక్షరాస్యత పెరిగితే జనాభా నియంత్రణ సాధ్యమని భావించాం. 'ఒక్కరు ముద్దు, ఇద్దరితో సరి' వంటి ప్రచారాలు చేశాం. కానీ ఇప్పుడు రాష్ట్రంలో, దేశంలో ఫెర్టిలిటీ రేటు గణనీయంగా పెరగాల్సిన అవసరం ఉంది" అని ముఖ్యమంత్రి వివరించారు. ప్రపంచవ్యాప్తంగా 40కి పైగా దేశాల్లో జనాభా తగ్గిపోతోందని, భారతదేశంలో ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోందని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. "అభివృద్ధి సంతులనం కావాలంటే జనాభా నిర్వహణ చాలా కీలకం. రాష్ట్రంలో అంగన్‌వాడీలు, పాఠశాలల్లో పిల్లల సంఖ్య తగ్గుతోంది. వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. రాష్ట్రంలో ప్రతి వంద మందిలో 89 శాతం మందికి రెండో సంతానం లేదు. విశాఖ వంటి జిల్లాల్లో ఫెర్టిలిటీ రేటు చాలా తక్కువగా ఉంది. విస్తీర్ణంలో ఏపీ 7వ స్థానంలో ఉన్నా, జనసాంద్రతలో దిగువన ఉన్నాం. పిల్లలే మన రాష్ట్ర సంపద. వారితోనే ఆర్థిక ప్రగతి" అని ఆయన అన్నారు. చిన్న కుటుంబాల భావన పెరిగిపోవడం, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగు కావడంపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. "మైక్రో ఫ్యామిలీల గురించి యువత ఆలోచించడం ప్రమాదకరం. సంతానం వద్దనుకునే దంపతులు పెరగటం దురదృష్టకరం. భారతీయ ఉమ్మడి కుటుంబ వ్యవస్థే ప్రపంచానికి ఆదర్శం. పిల్లలే సంపద- ఉమ్మడి కుటుంబమే శ్రీరామ రక్ష" అని ఆయన అన్నారు. పిల్లలను పెంచడం కేవలం మహిళల బాధ్యతే కాదని, అదొక ఉమ్మడి బాధ్యత అని స్పష్టం చేశారు. మహిళల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కాన్పుల్లో సిజేరియన్ ఆపరేషన్లు తగ్గాలని సూచించారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమాల దుర్వినియోగంపై చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. తెలంగాణలో పోక్సో నిందితుడు ఒకే కుటుంబంలో ఆరుగురిని హత్య చేసిన ఘటనను ప్రస్తావిస్తూ, సోషల్ మీడియా వ్యసనంగా మారి మానసిక సమస్యలకు దారితీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. టెక్నాలజీకి ఆధ్యాత్మికతను జోడించడం ద్వారా యువత ప్రపంచాన్ని జయించగలదని ఆయన అభిప్రాయపడ్డారు. యువత నైపుణ్యం, వృద్ధుల అనుభవం సమాజానికి రెండు కళ్ల వంటివని, వారిని ఆస్తిగా మార్చాలని సీఎం అన్నారు. త్వరలో వృద్ధుల కోసం 'క్షేమం' అనే కార్యక్రమాన్ని తీసుకురానున్నట్లు తెలిపారు. 'తల్లికి వందనం' ద్వారా విద్యార్థులకు, 'సంజీవని' ద్వారా ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా ఇస్తోందన్నారు. 2047 నాటికి రాష్ట్ర తలసరి ఆదాయాన్ని రూ.55 లక్షలకు చేర్చాలన్న తన సంకల్పానికి, 2040 నాటికే స్వర్ణాంధ్ర సాధనకు తగినంత మానవ వనరులు అత్యవసరమని ఆయన పునరుద్ఘాటించారు. అనంతరం 'పాపులేషన్ మేనేజ్‌మెంట్ ఫ్రేమ్‌వర్క్' డాక్యుమెంటేషన్‌ను ముఖ్యమంత్రి ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ రావు, వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# తెరపైకి మెన్ కమిషన్




ఇది అత్యంత బాధాకరమైన విషయం.. ఎందుకంటే జరుగుతున్న సంఘటనలు అలా ఉన్నాయి కాబట్టి. గతంలో ఎన్నడూ కూడా ఈ విధంగా లేదు.. ఇలాంటి సంఘటనలు జరగలేదు. కానీ ఇప్పుడు ఒక దాని తర్వాత ఒకటి చోటు చేసుకుంటున్నాయి. ఎలా ఉంటున్నాయి అంటే.. ఒకదాన్ని మించి మరొకటి ఉంటున్నాయి. పైగా భయాన్ని కలగజేస్తున్నాయి. జీవితంలో పెళ్లి అంటేనే వెన్నులో వణుకు పుట్టే విధంగా చేస్తున్నాయి. పూణేలో కేతన్ అగర్వాల్ ను అతనికి కాబోయే భార్య సియా, ఆమె ప్రియుడు చేతన్ చంపేసిన తర్వాత.. ఆ విషయం వెలుగులోకి వచ్చిన తర్వాత.. ఈ కేసు కు సంబంధించిన అనేక సంచలన నిజాలు ఒకదాని వెంట ఒకటి బయటపడుతున్న తర్వాత.. మనదేశంలో ఒక రకమైన చర్చ నడుస్తోంది. ఆ చర్చ ఏకంగా పార్లమెంట్ దాకా వెళ్ళింది. పైగా పెద్ద పెద్ద రాజకీయ నాయకులు కూడా జరుగుతున్న పరిణామాలను చూసి భయపడుతున్నారు. దేశంలో ఒక వింత, విచిత్రమైన, మునుపెన్నడూ ఊహించని చర్చ మొదలైంది. ఇప్పటివరకు 'మగాడ్రా బుజ్జీ.. నీకేం తక్కువ?' అంటూ మీసాలు తిప్పిన పురుష పుంగవుల కోసం ప్రత్యేకంగా ఒక కమిషన్ కావాలంటూ రాజ్యసభ ఎంపీ అశోక్ కుమార్ మిట్టల్ ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లును పార్లమెంట్‌లో పడేశారు. "జాతీయ మహిళా కమిషన్" తరహాలోనే, ఇకపై "జాతీయ పురుషుల కమిషన్" కూడా పెట్టాలని ఆయన డిమాండ్. ఈ బిల్లు బయటకొచ్చిందో లేదో.. పుణెలో జరిగిన కేతన్ అగర్వాల్ హత్య కేసు పుణ్యమా అని సోషల్ మీడియాలో 'మెన్ ఆర్ ఆల్సో హ్యూమన్స్' (మగాళ్లు కూడా మనుషులే) అనే ట్రెండ్ ఊపందుకుంది. కన్నీళ్లు పెడుతున్న 'కండల వీరులు' సమాజంలో మగాడంటే ఎప్పుడూ స్ట్రాంగ్‌గా ఉండాలి, ఏడవకూడదు.. భరించాలి అనే రూల్స్ ఉన్నాయి కదా! కానీ ఈ బిల్లు తెచ్చిన లెక్కలు చూస్తుంటే మగాళ్ల గుండెల్లో దాగున్న బాధలు హిమాలయాలంత ఉన్నట్టు కనిపిస్తోంది. ఇంట్లో భార్య చేతిలో లేదా బెల్లం ముక్క లాంటి అత్తగారి చేతిలో దెబ్బలు తిన్నా బయటకు చెప్పుకోలేక కుమిలిపోయే భర్తలు ఎందరో.. ఎక్స్ లోనో, పోలీస్ స్టేషన్ లోనో ఒక్క తప్పుడు కేసు పడితే.. కెరీర్ గోవిందా! విడాకులయ్యాక పిల్లల్ని చూడనివ్వకుండా కేవలం మెయింటెనెన్స్ డబ్బుల కోసం మాత్రమే వాడుకునే 'ఏటీఎం' మిషన్లుగా మగాళ్లు మారుతున్నారట. ఆఫీసు ఒత్తిళ్లు, సామాజిక అంచనాలు తట్టుకోలేక దేశంలో పురుషుల ఆత్మహత్యల శాతం రాకెట్‌లా దూసుకెళ్తుంటే.. "అయ్యో పాపం" అనే నాథుడే కరువయ్యాడని పురుషుల హక్కుల సంఘాలు గొంతు చించుకుంటున్నాయి. ఒకవేళ దేవుడు కరుణించి అంటే పార్లమెంట్ ఒప్పుకొని ఈ కమిషన్ ఏర్పాటైతే.. మగాళ్లకు ఒక 'సేఫ్ జోన్' దొరుకుతుంది. "మా ఆవిడ నన్ను రోజుకు పదిసార్లు తిడుతోంది సార్" అని ఏడ్చే భర్తలకు ఉచితంగా టిష్యూ పేపర్లు, మానసిక ధైర్యం ఇస్తారు. ఉచిత న్యాయ సహాయం కింద తప్పుడు కేసుల నుంచి ఎలా తప్పించుకోవాలో లాయర్లతో ఫ్రీగా సలహాలు ఇప్పిస్తారు. అలిగిన భర్తలకు, అత్తగారి వేధింపులకు గురయ్యే అల్లుళ్లకు ఇదొక పెద్ద దిక్కు అవుతుంది."మేమేదో మహిళల హక్కులను లాగేసుకుందామని చూడట్లేదు బాబోయ్! వాళ్ల చట్టాలు వాళ్లకుండనివ్వండి.. మాకు కనీసం ఒక చిన్న కంప్లైంట్ బాక్స్ అయినా ఇవ్వండి" అని బిల్లు ప్రతిపాదకులు చేతులు జోడించి మరీ చెప్తున్నారు. చట్టం అవుతుందా.. లేక చాయ్ బిస్కెట్ ముచ్చటవుతుందా? మన దేశ పార్లమెంట్ చరిత్ర చూస్తే 'ప్రైవేట్ మెంబర్ బిల్లులు' చట్టాలుగా మారడం అనేది.. లాటరీలో కోటి రూపాయలు తగలడం కంటే అరుదు. కాబట్టి ఈ బిల్లు రేపో మాపో చట్టం అయిపోయి, మగాళ్లందరికీ రక్షణ వచ్చేస్తుందని పగటి కలలు కనడం కాస్త అత్యాశే అవుతుంది. అయినప్పటికీ "మగాడికి కూడా మనసుంటుంది, వాడికీ కష్టాలొస్తాయి" అనే ఒక టాపిక్ మీద పార్లమెంట్ లో చర్చ జరగడమే ఒక పెద్ద అద్భుతం. మరి ఈ పురుషుల కమిషన్ ముచ్చట ఎంతవరకు వెళ్తుందో అధికార పక్షం దీనిపై ఎలాంటి 'పంచ్‌లు' వేస్తుందో చూడాలి. అంతవరకు.. ఆల్ ది బెస్ట్ మగాళ్లూ! మీ బాధలను వినడానికి కనీసం ఒక బిల్లు అయినా పుట్టుకొచ్చింది, సంతోషించండి.. ఇది పద్ధతి కాదు.. ఇది విధానం కాదు.. దీనికి పాడాలి చరమగీతం అన్నట్టుగా మాట్లాడుతున్నారు. ఇటీవల కాలంలో మగవాళ్ళను ప్రియురాళ్లు, భార్యలు చంపేస్తున్న నేపథ్యంలో.. ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. పెళ్లి చేసుకోవాలంటే మగవాళ్ళు భయపడిపోతున్నారు. అసలు ఇలా కూడా జరుగుతుందా.. ఇలా ప్రాణాలు తీస్తుంటే ఇక పెళ్లిళ్లు ఎందుకు చేసుకోవాలని మగవాళ్ళు ప్రశ్నిస్తున్నారు. ఒంటరి జీవితమే బాగుం టుందని.. ఒంటరిగా మిగిలిపోవడమే గొప్పగా ఉంటుందని భావిస్తున్నారు. మగవాళ్ళ బాధలు చూడలేక కొన్ని సందర్భాలలో రాజకీయ నాయకులూ స్పందిస్తున్నారు. తాజాగా అశోక్ కుమార్ అనే రాజ్యసభ సభ్యుడు పెద్దల సభలో కీలక వ్యాఖ్యలు చేశాడు. మగవాళ్ళ మీద రోజురోజుకు దాడులు పెరిగి పోతున్నాయని.. మగవాళ్ళను చంపేస్తున్నారని.. మగవాళ్ళ ప్రాణాలకు గ్యారెంటీ లేకుండా పోయిందని.. చెబుతూ.. మగ వాళ్లకు కూడా కమిషన్ ఏర్పాటు చేయాలని.. ఆడవాళ్ళ నుంచి మగవారిని కాపాడాలని ఆయన సాక్షాత్తు పెద్దల సభలో వ్యాఖ్యానించడం విశేషం. అయితే ఆయన చేసిన వ్యాఖ్యల పట్ల మెజారిటీ ప్రజల నుంచి సానుకూల ప్రకటన రావడం గమనార్హం.

# ఏపీలో మరో కూటమి



**విజయవాడ – సూర్య వాస్తవం**

ఏపీలో మరో కూటమి అవతరించనుందా? వచ్చే ఎన్నికల నాటికి ప్రస్తుతం ఉన్న కూటమికి పోటీగా ఇది మారనుందా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. 2024 ఎన్నికల సమయంలో కూటమి కట్టిన టీడీపీ, బీజేపీ, జనసేనలు ఐక్యంగా ముందుకు సాగుతున్నాయి. పైగా వచ్చే ఎన్నికల్లోనూ అంతే బలంగా ముందుకు సాగాలని కూటమి నిర్ణయించుకుంది. దీంతో ప్రస్తుతం ఉన్న కూటమి యేతర పార్టీలు ఒంటరి పోరాటం కంటే కలిసి నడిస్తేనే బెటర్ అన్న ఆలోచనకు వచ్చినట్టు గత కొన్నాళ్లుగా రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది కమ్యూనిస్టుల చొరవ ప్రత్యేకంగా కొత్త కూటమి కట్టే విషయంలో కమ్యూనిస్టులు చొరవ చూపిస్తున్నారు. రాష్ట్ర విభజనకు ముందు... కమ్యూనిస్టులకు కొన్ని నియోజకవర్గాల్లో ప్రాబల్యం ఉంది. అయితే.. విభజన తర్వాత.. తెలంగాణలో పట్టు నిలుపుకొన్నప్పటికీ.. ఏపీలో కోల్పోయారు. సీపీఐ, సీపీఎంలు ఇప్పటి వరకు జరిగిన 2014, 2019, 2024 ఎన్నికల్లో పోటీ చేయడమే తప్ప.. గెలిచిందే లేదు. 2019లో జనసేనతో పొత్తు పెట్టుకున్నా.. ఫలితం దక్క లేదు. ఈ నేపథ్యంలో ఎన్నికలకు రెండేళ్ల ముందే కూటమి కట్టే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. కలిసొచ్చే పార్టీలను కమ్యూనిస్టులు రహస్యంగా కలుస్తున్నారని తెలుస్తోంది. ప్రధానంగా వైసీపీ నేతలను ఓ కీలక కమ్యూనిస్టు, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నాయకుడు కలిశారని.. పొత్తు పెట్టుకు ని ముందుకు వెళ్దామని ఆయన సూచించినట్టు వైసీపీ వర్గాల్లోనూ చర్చ జరుగుతోంది.

జగన్‌కు సన్నిహితుడై న సదరు నేత సూచనలను వైసీపీ కూడా పరిగణనలోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న కూటమిని చీల్చే ప్రయత్నం చేసినా.. అది ఫలించలేదు. ఈ నేపథ్యంలో తాము కూడా ఓ కూటమిగా ముందుకు వెళ్లేందుకు జగన్ కూడా సుముఖంగానే ఉన్నారని వైసీపీ నాయకులు తరచుగా చెబుతున్నారు. "ఒంటరి ప్రయాణం మంచిదే. అయితే..కూటమిగా వెళ్తే మరింత తేలికగా.. విజయం దక్కించుకోవచ్చు" అని కృష్ణా జిల్లా కు చెందిన మాజీ మంత్రి ఒకరు వ్యాఖ్యానించారు. ఇక, ఈ కూటమిలో కాంగ్రెస్ కూడా ఉంటుందన్న టాక్ వస్తోంది. అయితే.. కాంగ్రెస్ పార్టీ ఈ కూటమిలో ఉంటే వైసీపీ ఉండదని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇక, చిన్న చితకా పార్టీలు.. కూడా చేతులుకలిపి కొత్త కూటమి ఏర్పాటుకు ముందుకు వస్తున్నాయన్నది రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతున్న చర్చ. మరి ఏం జరగుతుంది? ఈ కూటమి ఏర్పడుతుందా? లేదా? అనేది కొన్నాళ్లు వెయిట్ చేసి చూడాల్సిందే.

# అసలు కేసీఆర్‌కు ఏమైంది..



**హైదరాబాద్ – సూర్య వాస్తవం**

తెలంగాణలో కాంగ్రెస్స్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లయింది. తెలంగాణను సాధించి.. రాష్ట్రాన్ని తొమ్మిదిన్నరేళ్లు పాలించిన కేసీఆర్‌ను కొట్టడం ఎవరికీ సాధ్యం కాదనుకున్నారు. కేసీఆర్, కేటీఆర్ కూడా బీజేపీపై ఫోకస్ పెట్టారు. కానీ రేవంత్‌రెడ్డి బాహుబలిలా షాక్ ఇచ్చాడు. బలమైన కేసీఆర్‌ను ఒంటిచేత్తో ఓడించాడు. రెండున్నరేళ్లుగా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. ఇలాంటి పరిస్థితిలో కేసీఆర్ రాజకీయ జోస్యాలు చెబుతూ మళ్లీ వచ్చేది బీఆర్ఎస ప్రభుత్వమే.. ముఖ్యమంత్రి అయ్యేది కేసీఆరే అంటూ చెప్పుకుంటున్నారు. ఇవి తెలంగాణ రాజకీయ వాతావరణాన్ని సంక్లిష్టంగా మారుస్తున్నాయి. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు ఏమీ చేయలేదని, తెలంగాణ ప్రజలు సీఎం రేవంత్, మాజీ సీఎం కేసీఆర్ పాలనను పోల్చి చూసుకుంటున్నారని పేర్కొంటున్నారు. మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని కోరుకుంటున్నారని చెబుతున్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధిలో రేవంత్ సగం కూడా చేయలేదని ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ వైఫల్యాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయన్న ధీమా కేటీఆర్‌లో కనిపిస్తుంది. కానీ, రెండున్నరేళుల ఫామ్‌హౌస్‌కు పరిమితమైన కేసీఆర్.. రాజకీయాల్లో మళ్లీ యాక్టివ్ అయ్యే పరిస్థితిపై సందిగ్ధం నెలకొంది. కేసీఆర్‌ను ఇక శాశ్వతంగా ఫామ్‌హౌస్‌కే పరిమితం చేస్తామని రేవంత్ అంటున్నారు. ఎన్నికలు కేవలం ప్రత్యర్థి అనుభవ లోపాలపై ఆధారపడి జరుగవు. నాయకత్వం, కమ్యూనికేషన్, స్థానిక శ్రేణులలోని శక్తి సమీకరణం, సందర్భోచిత సంఘటనలు కూడా ఫలితాన్ని నిర్ణయిస్తాయి. కాబట్టి కాంగ్రెస్ విఫలమైందనే కారణంతో బీఆర్ఎస్ నిర్బంధ విజయమనే జోస్యం తాత్కాలికమే. కేసీఆర్ కూతురు పార్టీ నుంచి బయటకు వచ్చి ధైర్యంగా రాజకీయాలు చేస్తున్నారు. కేటీఆర్ మాత్రం ఇప్పటికీ తండ్రి పేరు చెప్పుకుంటున్నారు. కేసీఆరే కాబోయే ముఖ్యమంత్రి అంటున్నారు. తనను తాను సీఎంగా ప్రొజెక్టు చేసుకోలేకపోతున్నారు. బీఆర్ఎస్‌కి పెద్ద పట్టు ఉన్నా, కుటుంబ రాజకీయాలకు సంబంధించిన అనుబంధ, అంతర్గత విభాగాల ఒత్తిళ్లు, కవిత వంటి నాయకత్వ కొత్త అంశాలు పార్టీకి కొత్త సవాళ్లు తీసుకురావచ్చు. ఒక పార్టీకి నిరంతరంగా అధికారంలో ఉండటానికి సమర్థ నాయకత్వానికి తోటి స్థాయి వ్యూహపరమైన నవీనత, యువ శ్రేణుల ఆకర్షణ, పాలనా ప్రదర్శనలో నిరంతర ఉత్తేజం అవసరం. బహుశా ప్రస్తుతం బీఆర్ఎస్ కీలకంగా కనిపించినా, గెలుపు హామీ సులభంగా చెప్పలేం. తెలంగాణలో బీజేపీ ప్రభావం కూడా పెరిగింది. కేంద్ర స్థాయి మద్దతు, వనరుల వినియోగం, స్థానిక మద్దతుదారుల ఆకర్షణ వ్యూహాలు చివరికి స్థానిక బలహీనతలను ఉపయోగించవచ్చు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే అంటోంది. బెంగాల్ తర్వాత తెలంణపై ఫోకస్ పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సమయంలో బీఆర్ఎస్ కాంగ్రెస్ వైఫల్యాలను నమ్ముకోవడం కుక్క తోక పట్టుకుని గోదావరి ఈదినట్లే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తెలంగాణ రాజకీయ స్థితి ఒకే పరీక్ష పెడుతున్న సమయం. ఈ సమయంలో పార్టీని, క్యాడర్‌ను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతిపక్ష నాయకులపై ఉంది. మరో ఏడాది గడిస్తే ఎన్నికల మూడ్ వస్తుంది ఆలోగా బలోపేతం కాకుంటే భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుంది.

# చిన్నమ్మ పురందేశ్వరీ సంగతి ఏంటీ



**రాజమండ్రి – సూర్య వాస్తవం**

రాజమండ్రి పార్లమెంటు సభ్యురాలు పురంద్రీశ్వరికి ఈ టర్మ్ లో కీలక పదవి దక్కే అవకాశం లేనట్లే ఉంది. కేంద్ర మంత్రి వర్గ విస్తరణ జరిగినప్పుడల్లా ఆమె పేరు పదే పదే వినిపించడం చివరి నిమిషంలో దక్కక పోవడం జరుగుతుంది. ఈసారి కూడా అదే జరుగుతుందోమేనన్న ఆందోలన చిన్నమ్మ అభిమానుల్లో ఉంది. త్వరలో కేంద్ర మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో పురంద్రీశ్వరికి మళ్లీ పదవి దక్కుతుందని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. కానీ కష్టమేనని చెబుతున్నారు. అందుకు అనేక కారణాలున్నాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా, ఎన్టీఆర్ కుమార్తెగా ఆమె పార్టీ కోసం బాగా పనిచేసినప్పటికీ కొన్ని కారణాలు ఆమె పదవికి అడ్డం పడుతున్నాయన్నది హస్తిన వర్గాల నుంచి అందుతున్న సమాచారం. 2024లో కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో ఆమె కేంద్ర మంత్రి పదవి వస్తుందని అనుకున్నారు. కానీ నర్సాపురం పార్లమెంటు సభ్యుడు శ్రీనివాసవర్మను కేంద్ర మంత్రివర్గంలోకి అనూహ్యంగా తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వంలో టీడీపీకి మాత్రం రెండు పదవులు లభించాయి. తెలంగాణలో ఎనిమిది స్థానాలను గెలవడంతో ఇద్దరికి మంత్రి పదవులు దక్కాయి. టీడీపీ నుంచి కేంద్ర మంత్రిగా ఉన్న గుంటూరు పార్లమెంటుసభ్యులు పెమ్మసాని చంద్రశేఖర్ ప్రధాన కారణం. ఆయనను కేంద్ర మంత్రి వర్గం నుంచి తప్పించే ఛాన్సులు అయితే లేవు. ఎందుకంటే పెమ్మసాని లోకేశ్ కు, చంద్రబాబుకు అత్యంత ఆప్తుడు. పెమ్మసాని కమ్మ సామాజికవర్గం కావడంతో ఇకపురంద్రీశ్వరికి ఆకోటాలో మంత్రివర్గంలో చోటు కల్పించలేని పరిస్థితి నెలకొంది. ఇక జాతీయ అధ్యక్ష పదవి అనికొన్నాళ్లు పురంద్రీశ్వరి పేరు వినిపించింది. కానీ అది సాధ్యం కాలేదు. తర్వాత స్పీకర్ పదవి అన్నారు. ఓంబిర్లాను ఆ పదవి నుంచి తప్పించే అవకాశాలు లేవు. పురంద్రీశ్వరి కి కేంద్రంలో కీలకమైన పదవులు ఈసారి అంటే రానున్న మూడేళ్ల కాలంలో దక్కే అవకాశం లేదన్నది పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి, ఇక్కడ పురంద్రీశ్వరి ఎంపీగా మరొకసారి విజయం సాధిస్తే అప్పుడు చూడొచ్చులే అన్న ధోరణిలో కేంద్ర నాయకత్వం ఉందని తెలిసింది. మొత్తం మీద చిన్నమ్మకు ఈ టర్మ్ లో మాత్రం ఎటువంటి పదవులు.. ఇటు ప్రభుత్వంలో కానీ, అటు పార్టీలో కానీ దక్కే అవకాశాలు లేవన్నది వాస్తవం. అందుకే పురంద్రీశ్వరి రాజమండ్రి నుంచి మరోసారి గెలిచేందుకు బేస్ ను పటిష్టం చేసుకునేందుకే ఎక్కువ సమయం వెచ్చిస్తున్నారు

## రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జె.సి.అస్మిత్ రెడ్డి



**తాడిపత్రి – సూర్య వాస్తవం :** యాడికి మండలం చందన గ్రామంలో రీసర్వే పూర్తయిన రైతులకు తాడిపత్రి శాసనసభ్యులు జె.సి. అస్మిత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుబుక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే జె.సి. అస్మిత్ రెడ్డి మాట్లాడుతూ, మీ భూమి పాసుబుక్కులపై రాజకీయ నేతల ఫోటోలు ఎందుకు ఉండాలి? భూమి మీది, దానిపై సర్వహక్కులూ మీకే ఉంటాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ అధికారిక ముద్రతోనే ఇకపై పాసుబుక్కులు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఇదే సమయంలో యాడికి మండలానికి సాగు, త్రాగు నీరు అందించాల్సిన బాధ్యత తనదేనని, ఆ దిశగా పూర్తి స్థాయిలో కృషి చేస్తానని రైతులకు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు, టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిల్లల మధ్య సరైన వ్యవధి పాటిద్దాం

**- తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడుదాం**

**- ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కనేకల్‌లో చైతన్య ర్యాలీ**




**కణేకల్– సూర్య వాస్తవం:** ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని కనేకల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) ఆధ్వర్యంలో శనివారం కుటుంబ నియంత్రణ, మాతా–శిశు ఆరోగ్య పరిరక్షణపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. "పిల్లల మధ్య సరైన వ్యవధి పాటిద్దాం -- తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడుదాం" అనే నినాదంతో నిర్వహించిన ర్యాలీ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ముందుగా సీహెచ్‌సీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యులు కుటుంబ ఆరోగ్యం పట్ల ప్రాముఖ్యతను వివరించారు. పిల్లల మధ్య తగిన వ్యవధి ఉండటం వల్ల తల్లి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు శిశువుల శారీరక, మానసిక వికాసానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ప్రతి కుటుంబం బాధ్యతాయుతంగా కుటుంబ సంక్షేమ సేవలను వినియోగించుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం సీహెచ్‌సీ నుంచి కనేకల్ బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వైద్యులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ ఎంలు, ఆరోగ్య సిబ్బంది నినాదాలు చేస్తూ ప్రజలకు కుటుంబ ఆరోగ్యం, మాతా–శిశు సంక్షేమంపై కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమంలో వైద్యురాలు డాక్టర్ సౌందర్య, సూపర్వైజర్ నరసింహులు, ఎంఎల్ హెచ్ పీలు వెన్నెల, కస్తూరి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**జనసేనాని సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని**

## అనంతపురంలో ప్రత్యేక పూజలు



**అనంతపురం – సూర్య వాస్తవం:** జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు రెండు భుజాల్లోనూ తీవ్రమైన రోటేటర్ కఫ్ గాయాలు ఉన్నట్లు నిర్ధారించారని చెప్పారు. రోటేటర్ కఫ్ చిరగడంతో పాటు, ఆయన కుడి భుజంలో అవల్షన్ ఫ్రాక్చర్ ఏర్పడటంతో ఓ పెద్ద శస్త్రచికిత్స అవసరమైందని అన్నారు. ఆయన కుడి భుజానికి చేసిన ఈ శస్త్రచికిత్స సుమారు మూడున్నర గంటల పాటు కొనసాగించారని.. ఈ సర్జరీ విజయవంతంగా పూర్తయిందని అధికారులు తెలిపారు. శస్త్రచికిత్స విజయవంతంగా ముగిసినా, ఆయన ధ్యాస అంతా ప్రజల సంక్షేమం పైనే ఉందని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ అనంతపురంలో ప్రత్యేక ప్రార్థనలు . ?ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షులు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్ సూచనల మేరకు... జనసేన నగర అధ్యక్షులు పొదిలి బాబురావు ఆధ్వర్యంలో కోర్ట్ రోడ్‌లోని శ్రీ వరద ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ?శ్రీ ఆంజనేయ స్వామి వారి దివ్య ఆశీస్సులతో జనసేనాని త్వరగా కోలుకుని, మరింత ఉత్సాహంతో ప్రజాసేవను కొనసాగించాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నగర, జిల్లా కమిటీ నాయకులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, వీర మహిళలు, జనసైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# ఎస్ఐఆర్ పై ప్రత్యేక దృష్టి పెట్టి పూర్తి చేయాలి..

**- జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్**



**అనంతపురం– సూర్య వాస్తవం :** ప్రత్యేక దృష్టి పెట్టి ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం అనంతపురంలోని లెనిన్ కాలనీ మరియు ఆర్కే కాలనీలలో ఉన్న పోలింగ్ కేంద్రం నంబర్లు 281, 285, నవోదయ కాలనీ ఏరియాలో ఉన్న పోలింగ్ కేంద్రం నంబర్లు 269, 271 పరిధిలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)ను జాయింట్ కలెక్టర్, అనంతపురం అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గ నోడల్ అధికారి తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి, ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను జెసి సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై శనివారం, ఆదివారం రోజులలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టడం జరుగుతోండగా, క్షేత్రస్థాయిలో ప్రత్యేక డ్రైవ్ ఏ విధంగా జరుగుతుందో పరిశీలించడం జరిగిందన్నారు. గడువులోగా వేగంగా ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి అప్లోడ్ చేసేలా చూడాలని ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ విషయంలో ఏవైనా లోపాలు, నిర్లక్ష్యం లేదా అశ్రద్ధ కనిపిస్తే తీవ్రంగా పరిగణించబడుతుందని మరియు సంబంధిత అధికారులపై తగిన చర్యలు తీసుకుంటామని జెసి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, బిఎల్ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేయండి

**- ఎమ్మార్వో మోహన్ కుమార్**



**కూడేరు – సూర్య వాస్తవం :** ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్ఐఆర్ ) ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని మండల రెవిన్యూ ఆఫీసర్ మోహన్ కుమార్ బూత్ లెవెల్ ఏజెంట్లు, బూత్ లెవెల్ అధికారులను ఆదేశించారు. మండలంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రోగ్రాంను ఎమ్మార్వో మోహన్ కుమార్‌తో కలిసి జిల్లా వైస్సార్సీపీ విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించి, పర్యవేక్షించారు. ఓటర్ల నమోదు, మార్పులు చేర్పుల ప్రక్రియను నిశితంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో వీఆర్వో మనోజకుమార్, బిఎల్ఏలు ప్రవీణ్, గురునాథ్, మరియు బిఎల్వోలు కార్తీక్, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో సర్వసభ్య సమావేశం



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలో ప్రభుత్వ పెన్ష నర్ల భవనంలో సర్వ సభ్య సమావేశం ప్రెసిడెంట్ అబూబా కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంత డిప్యూటీ క లెక్టర్ గోవింద రాజులు హాజరయ్యారు. వీరు రాష్ట్ర ముఖ్య సలహాదారులుగా పని చేస్తు న్నారు. వీరు గుత్తిలో కూడా వ యో వృద్ధుల సంక్షేమ సంఘం ఏర్పాటు చేయాలని సూచిం చారు. ఎన్నుకున్న పాలక వర్గ ము వారి పేర్లు అధ్యక్షుడు కె.అబూబాకర్, అధ్యక్షుడు ఎ.వి.సుధాకర్ బాబు,వైస్ ప్రెసిడెంట్ యం.స్వర్ణాంబ, కార్యదర్శి. ఆర్.లక్ష్మి నారాయణ రెడ్డి,జా యింట్ సెక్రటరీ జెన్నే కుల్లా యిబాబు.కార్యవర్గ సభ్యులు డి.విజయ లక్ష్మి, యం.వెంకట సుబ్బమ్మ, పి.గోవిందప్ప, డి.సిద్దయ్య, సి.శకుంతలమ్మ, సుబుర్ ఎన్నుకున్నారు.

## జూలై 16న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుపతి– సూర్య వాస్తవం:**

శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో జూలై 17 నుంచి 19వ తేదీ వరకు జరగనున్న సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలకు ముందుగా జూలై 16న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున సుప్రభాతం, తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం అనంతరం ఉదయం 6.30 నుంచి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగుతుంది. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రిని పవిత్ర జలంతో శుద్ధి చేసి, నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తారు.

## పంటల బీమా తప్పక చేసుకోండి

**- వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ .**

**- ప్రకృతి వైపరీత్యాల వల్ల తక్కువ వర్షపాతం నమోదయ్యే పరిస్థితి**



**పామిడి – సూర్య వాస్తవం :** మండలంలోని రైతులందరూ ప్రభుత్వం కల్పిస్తున్న పంటల బీమా ఈఏడాది సూపర్ ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, రైతులు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని మండల వ్యవసయశాఖ అధికారి విజయ్ కుమార్ సూచించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల తక్కువ వర్షపాతం నమోదయ్యే పరిస్థితులు మిక్కిలిగా కనిపిస్తు న్నందున పంటల దిగుబడి లోటు ఏర్పడవచ్చునని, అందువల్ల ఆర్థిక నష్టాన్ని కొంతవరకు పంటల బీమా భర్తీ చేస్తుందని తెలిపారు. మండలంలోని రైతులందరూ ప్రభుత్వం కల్పిస్తున్న పంటల బీమా అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గడువులోపు నమోదుచేసుకోవాలని కోరారు.పంటల బీమా నమోదు కోసం రైతులు అవసరమైన పత్రాలతో సమీప రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే) లేదా వ్యవసాయశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని వ్యవసాయఅధికారి తెలిపారు.

## ఘాట్ రోడ్డులో ఎలివేటెడ్ కారిడార్



**కర్నూలు– సూర్య వాస్తవం :** ఏపీలోని పెద్ద దోర్నాల వైపు నుంచి శ్రీశైలం వైపు ఎలివేటెడ్ కారిడార్‌పై ఔఊంఎ ఫోకస్ పెట్టింది. శ్రీశైలం ఘాట్‌లో పులులు, ఇతర వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు కూడా తీసుకుంటున్నారు. దీని కోసం డబ్ల్యూఐఐతో అధ్యయనం చేయించాలని నిర్ణయించారు. ఈ ఎలివేటెడ్ కారిడార్ అందుబాటులోకి వస్తే శ్రీశైలం వెళ్లే వాహనాలు రాత్రి సమయంలోనూ ఘాట్‌లో రాకపోకలు కొనసాగించేందుకు అవకాశం వస్తుందని చెబుతున్నారు.శ్రీశైలం మల్లన్న దర్శనానికి ప్రతిరోజూ వేలాదిమంది భక్తులు వెళుతుంటారు. వాహనాలు నల్లమలలోని ఘాట్ రోడ్డు మీదుగా శ్రీశైలం వెళ్లాలి.. ఈ రూట్‌లో వాహనాల రాకపోకలకు సంబంధించి కొన్ని ఆంక్షలు అమల్లో ఉన్నాయి. ఈ ఘాట్ రోడ్డులో ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంట వరకు మాత్రమే వాహనాలను అనుమతిస్తారు. నల్లమల అటవీ ప్రాంతంలో వన్యప్రాణులు, అడవి జంతువుల కోసం ఘాట్ రోడ్డులో రాత్రివేళల్లో వాహనాలను అనుమతించడం లేదు. ఇటీవల కాలంలో శ్రీశైలం వెళ్లే భక్తుల సంఖ్య పెరుగుతోంది.. రాత్రి సమయంలో ప్రయాణించడానికి అవకాశం లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నారు.శ్రీశైలం వెళ్లే భక్తుల ఇబ్బందుల్ని గమనించి.. నల్లమలలోని అడవి జంతువులకు, భక్తులకు ఇబ్బంది లేకుండా ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. మార్కాపురం జిల్లా పెద్దదోర్నాల నుంచి శ్రీశైలం వరకు నేషనల్ హైవే 765లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో నల్లమ అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఏపీలోని మార్కాపురం జిల్లా పెద్దదోర్నాల నుంచి శ్రీశైలం 41.39 కిలోమీటర్ల రోడ్డు ఉంది. తెలంగాణ విషయానికి వస్తే.. బ్రాహ్మణపల్లి నుంచి శ్రీశైలం ప్రాజెక్ట్ వరకు 45.35 కిలోమీటర్ల రోడ్డు ఉంది. మొత్తం కలిపి 86.74 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని ప్లాన్ చేశారు.ఈ ప్రాజెక్టుకు అటవీశాఖ భూమి ఎక్కువగా అవసరం లేదు.. కేవలం పిల్లర్లు నిర్మిస్తే చాలు, దానికి కొంత స్థలం సరిపోతుంది. ఈ ఎలివేటెడ్ కారిడార్ అటవీ ప్రాంతంలో ప్లాన్ చేయడంతో జాతీయ వన్యప్రాణుల బోర్డు) అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుపై అధ్యయనం చేయడానికి డబ్ల్యూఐఐ (వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా) సహకారం కోరారు. పెద్దదోర్నాల మార్గంలో తుమ్మలబైలు, చిన్నారుట్లకు సమీపంలోని అటవీ ప్రాంతంలో పెద్దపులులు ఎక్కువగా సంచరిస్తుంటాయి. అందుకే డబ్ల్యూఐఐ టీమ్ అక్కడ వన్యప్రాణుల రక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేయనుంది. డబ్ల్యూఐఐ ఈ అంశాలపై అధ్యయనం చేసి ఆ నివేదికను జాతీయ వన్యప్రాణుల

# విద్య మన జీవితాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన ఆయుధం

- మొబైల్‌కు బానిస కాకుండా పుస్తకాలకు స్నేహితులుగా మారండి
- విద్యార్థి దశలో కలలు కనండి..., వాటిని నిజం చేసుకునే వరకు నిరంతరం శ్రమించండి
- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, పలమనేరు ఎమ్మెల్యే అమర్ నాథ్ రెడ్డి
- పెద్దపంజాణి, శంకర్రాయాలపేట ఏపీ బీసీ వెల్ఫేర్ స్కూల్ లో రూ. 10 లక్షలతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ను ప్రారంభించిన చిత్తూరు ఎంపీ, ఎమ్మెల్యేలు

**పలమనేరు – సూర్య వాస్తవం:** విద్య అనేది మన జీవితాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన ఆయుధం అని, ఈరోజు మీరు చదివే ప్రతి పాఠం, నేర్చుకునే ప్రతి నైపుణ్యం రేపటి మీ విజయానికి బలమైన పునాది అవుతుందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు,పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి విద్యార్థులకు హితబోధ చేశారు. పెద్దపంజాణి మండలంలోని శంకర్రాయాలపేట మహాత్మా జ్యోతి రావ్ పూలే ఏపీ బీసీ వెల్ఫేర్ స్కూల్ లో రూ. 10 లక్షలతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ను ఎంపీ , ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, పలమనేరు ఎమ్మెల్యే అమర్ నాథ్ రెడ్డి మాట్లాడుతూ..... సమయాన్ని వృథా చేయకుండా లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివితే ప్రపంచంలో ఏ శిఖరాన్నైనా అధిరోహించవచ్చునన్నారు .నేడు ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం విద్యా రంగంలో అనేక సంస్కరణలు తీసుకొస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల, నాణ్యమైన బోధన, డిజిటల్ లెర్నింగ్, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని వివరించారు . అలాగే ఉన్నత విద్యను ప్రోత్సహించేందుకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. విద్యా ప్రమాణాలను పెంచేందుకు పలు కొత్త కార్యక్రమాలు కూడా చేపడుతున్నారని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు, పథకాలను సద్వినియోగం చేసుకోవడం మీ బాధ్యత అన్నారు. ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ, క్రమశిక్షణతో చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యాలు,కమ్యూనికేషన్ స్కిల్స్, ఆంగ్ల భాషపై పట్టు, విలువలతో కూడిన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈరోజు మీరు చేసే కష్టం రేపటి విజయానికి పెట్టుబడి, మార్కులు మాత్రమే కాదు, మంచి మనస్సూ, విలువలు కూడా జీవితంలో గొప్ప సంపద అని గుర్తించండని తెలియజేశారు..మొబైల్‌కు బానిస కాకుండా పుస్తకాలకు స్నేహితులుగా మారాలని,పెద్ద కలలు కనండి... వాటిని నిజం చేసుకునే వరకు నిరంతరం శ్రమించాలని పిలుపునిచ్చారు. మీ విజయం మీ కుటుంబానికి గర్వకారణం కావాలి... మీ ఊరికి మంచి పేరు తీసుకురావాలి..., మీ జిల్లా, మీ రాష్ట్రం గర్వపడేలా



ఎదగాలి. చదువుతో పాటు మంచి సంస్కారం, క్రమశిక్షణ, సేవాభావం అలవరచుకుని దేశానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలన్నారు. అంతకు ముందు విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో సర్వ శిక్ష అభియాన్ పీవో వెంకటరమణ, పాఠశాల ప్రిన్సిపల్ జోత్స్నా, సిబ్బంది విక్టోరియా రాణి, చెంచులక్ష్మి, శిరీష, పలమనేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజన్న, టిడిపి మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, కూటమి నాయకులు ఆనంద్, చలపతి, మురహరి రెడ్డి, సుధాకర్ రెడ్డి, శ్రీరాములు, రామకృష్ణ, శంకరప్ప, నాగరాజు సుకుమార్,నందగోపాల్, ముబారక్ తదితరులు పాల్గొన్నారు...

# రతనాల సీమగా మారుతున్న రాయలసీమ

**తిరుపతి – సూర్య వాస్తవం:**
ఫ్యాక్షన్ గొడవలు.. బాంబులు.. కొట్లాటలు.. ప్రాణాలు తీయడాలు.. ఇవి సినిమాలో మాత్రమే కాదు.. రాయలసీమలో రియల్ గా జరిగేవి. ఐదు రూపాయల కోసం దారుణాలు జరుగుతాయని ఓ సినిమాలో చూపించారంటే.. రాయలసీమలో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు . ఒకప్పుడు శ్రీకృష్ణదేవరాయలు పరిపాలించిన రాయలసీమ.. కరువుకు కేరాఫ్ అడ్రస్. వలసలకు కేరాఫ్ అడ్రస్. దారిద్రానికి కేరాఫ్ అడ్రస్. కానీ ఇప్పుడు మారిపోయింది. కూటం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత రాయలసీమ తనముఖ చిత్రాన్ని ఈసారి పూర్తిగా మార్చుకుంటున్నది. ఒక నివేదిక ప్రకారం రాయలసీమ ప్రాంతంలో సుమారు 4.58 లక్షల పెట్టుబడులను కంపెనీలు పెడుతున్నట్టు తెలుస్తోంది. ఇక్కడ ఏకంగా 275 పారిశ్రామిక ప్రాజెక్టులు వివిధ దశలో ఉన్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా బెంగళూరు, కర్ణాటక సరిహద్దు చుట్టుపక్కల ప్రాంతాలు వివిధ రంగాల పెట్టుబడులతో నిరంతరం అభివృద్ధి చెందుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాయలసీమ కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఉంటుంది. ఒకప్పుడు ఏమో గాని.. ఇప్పుడైతే అత్యంత ఆశాజనకమైన అభివృద్ధి ప్రాంతాలలో ఒకటిగా నిలవబోతోంది. ఒకప్పుడు ఈ ప్రాంతం కరువు భూమిగా పేరుగాంచింది. ఇప్పుడు పునర్వాదక ఇంధనం.. తయారీరంగం.. లాజిస్టిక్స్.. వంటి రంగాలలో మొత్తంగా 275 పారిశ్రామిక ప్రాజెక్టులు ఏర్పాటు కాబోతున్నాయి. ఫలితంగా రాయలసీమ దక్షిణ భారతదేశంలోనే అత్యంత పెద్దదైన పారిశ్రామిక కేంద్రంగా రూపాంతరం చెందబోతోంది.రాయలసీమ లో అన్నమయ్య.. సత్యసాయి.. అనంతపురం.. నంద్యాల.. కడప.. కర్నూలు.. తిరుపతి వంటి ఏడు జిల్లాలు ఉన్నాయి.. ఈ ఏడు జిల్లాలు బెంగళూరు.. హైదరాబాద్.. చెన్నై నగరాలతో అనుసంధానం చేసే జాతీయ ప్రధాన రహదారులను కలిగి ఉన్నాయి. అనంతపురం కర్ణాటక సరిహద్దుకు 55 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. సత్య సాయి పుట్టపర్తి 75 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఈ ప్రాంతంలో హిందూపూర్ కర్ణాటక




రాష్ట్ర సరిహద్దుకు 20 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. కర్నూలు 95 కిలోమీటర్లు.. నంద్యాల 150 కిలోమీటర్లు.. కడప 150 కిలోమీటర్లు.. అన్నమయ్య 140 కిలోమీటర్లు.. తిరుపతి 2.0 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.4.5 లక్షల కోట్ల పెట్టుబడి ద్వారా మొత్తంగా 3.57 లక్షల ఉద్యోగాలు వస్తాయని తెలుస్తోంది.. పునరుత్పాదక శక్తి తయారీ.. ఎలక్ట్రానిక్స్.. ఆహార శుద్ధి.. సిమెంట్.. లాజిస్టిక్స్.. వస్త్ర పరిశ్రమ వంటి రంగాలలో ఇక్కడ కర్మాగారాలు ఏర్పాటు కాబోతున్నాయి. అతిపెద్దదైన సౌర. పవన విద్యుత్ ప్రాజెక్టులకు రాయలసీమ కేంద్రంగా మారబోతోంది.గ్రీన్కో సమీకృత పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు కర్నూలులోని పిన్నపురం ప్రాంతంలో ఏర్పాటు కాబోతోంది. ఈ ప్రాజెక్టు మీద గ్రీన్కో కంపెనీ 30 వేల కోట్లకు పైగా పెట్టుబడి పెడుతోంది.. ఈ ప్రాజెక్టు మొత్తం 5230 మెగా వాట్ల సామర్థ్యంతో పనిచేస్తుంది. ఇందులో మూడు వేల మెగావాట్లు సౌర విద్యుత్.. 550 మెగావాట్లు పవన, 1680 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీలు ఉన్నాయి.జె?ఎస్ డ బ్ల్యూ రాయలసీమ సమీకృత ఉక్కు కర్మాగారం. కడప ప్రాంతంలో రాయలసీమ సమీకృత ఉక్కు కర్మాగారాన్ని నిర్మించేందుకు జె?ఎస్ డ బ్ల్యూ స్టీల్ 16,350 కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ కర్మాగారం ప్రారంభ సామర్థ్యం 2 ఎంటీపీఏ గా ఉంది. భవిష్యత్ కాలంలో అది 5 ఎంటీపీఏ కు విస్తరించే అవకాశం ఉంది.

దీనిద్వారా పదివేల మందికి పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుంది.సత్యసాయి అనంతపురం జిల్లాలో 72 గిగా వాట్ల సామర్థ్యంతో సోలార్ పార్కులు ఏర్పాటు కాబోతున్నాయి. ఇందులో మడకశిర సోలార్ పార్క్ ఏడువేల కోట్లతో ఏర్పాటు కాబోతోంది. యశస్వ పవర్ ప్రాజెక్ట్ 2 మెగా వాట్లు.. ఎన్టిపిసి సోలార్ పార్క్ 1.2 గిగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు కాబోతోంది.సత్యసాయి జిల్లాలో 51,300 కోట్ల ప్రతిపాదిత పెట్టుబడితో రాయలసీమలోనే అతిపెద్ద సౌర ప్రాజెక్టును ఏర్పాటు చేస్తోంది. ఇవి మాత్రమే కాకుండా ఇండి చిప్ సెమీ కండక్టర్ ప్రాజెక్ట్ కర్నూలు ప్రాంతంలో ఏర్పాటు కాబోతోంది. 14,000 కోట్ల పెట్టుబడితో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే రెండు నుంచి మూడు సంవత్సరాల వ్యవధిలో నెలకు 10,000 నుంచి 50 వేల వేపర్లను ఇక్కడ ఉత్పత్తి చేస్తారుతిరుపతిలో 2,500 కోట్ల వ్యయంతో రాయల్ ఎన్ఫీల్డ్ మ్యానుఫ్యాక్చరింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు కాబోతోంది. కంపెనీ వార్షిక ఉత్పత్తికి అదనంగా 9 లక్షల మోటారు సైకిళ్లను తయారుచేస్తారు. 5000 నుంచి 15వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి.క్యారియర్ గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ.. శ్రీ సిటీ ప్రాంతంలో 1000 కోట్ల ఖర్చుతో కొత్త ప్లాంట్ ఏర్పాటు కాబోతోంది. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి ప్రాంతంలో లక్ష కోట్ల విలువైన గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేయబోతున్నారు. దక్షిణ కొరియాలోని పేరుపొందిన పాదరక్షల తయారీ సంస్థ హ్వా సింగ్ అనే కంపెనీ 898 కోట్ల పెట్టుబడితో చిత్తూరులో తన మొట్టమొదటి భారతీయ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతోంది. మొత్తంగా 17,000 మందికి ఉద్యోగాలు కల్పించబోతోంది.రిలయన్స్ రిటైల్ పానీయాల కేంద్రం కర్నూల్ లోని ఓర్వకల ప్రాంతంలో ప్లాంట్ ఏర్పాటు చేయబోతోంది. సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో వందల కోట్ల పెట్టుబడి పెట్టాలని చూస్తోంది. 5000 మందికి ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఉద్యోగాలు ఇవ్వబోతోంది.

# సింగపూర్‌కు తిరుపతి మామిడి...

**తిరుపతి– సూర్య వాస్తవం:** ఆంధ్ర మామిడి పండ్ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఒక్కో ప్రాంతానికి ఒక్కో రకం ఫేమస్. నూజివీడు రసాలు, ఉలవపాడు మామిడికాయ, చిత్తూరు తోతాపురి, ఇక బంగినపల్లి గురించయితే అస్సలు చెప్పాల్సిన అవసరం లేదు. ప్రపంచ వ్యాప్తంగా మన మామిడి పండ్లకి యమా గిరాకీ ఉంది. తాజాగా సింగపూర్‌కు మన మామిడి పండ్లను టన్నుల కొద్దీ ఎగుమతి మొదలైంది. సీఎం చంద్రబాబు నాయుడు నియోజకవర్గం నుంచే ఈ ఎగమతి మొదలవ్వడం విశేషం.చిత్తూరు జిల్లాలో తోతాపురి, బంగినపల్లి మామిడి కాయలు ఎక్కువ కాపు కాస్తాయి. కర్ణాటక పరిధిలోని చింతామణి ప్యాక్ హౌస్ నుంచి ఐదు టన్నుల మామిడి పండ్లతో ఉన్న కంటైనర్ చెన్నై ఓడరేవుకు బయల్దేరింది. భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ, సీఐఎస్‌హెచ్ సహకారంతో బంగినపల్లి, తోతాపురి మామిడి పండ్లను నౌక ద్వారా సింగపూర్‌కు పంపుతున్నట్లు ఓసమ్ ఫుడ్స్ డైరెక్టర్ వ్యవసాయ పారిశ్రామికవేత్త కోటేశ్వరరావు తెలిపారు.కుప్పం నియోజకవర్గంలోని మండలాలతో పాటు



పలమనేరు నియోజకవర్గంలోని వి.కోట మండల రైతుల నుంచి సేకరించిన మామిడిని సింగపూర్‌కు పంపినట్లు వారు తెలిపారు. ఈ మామిడి పండ్లను మొత్తాన్ని ఓ కంటైనర్‌లో ఉంచి, షిప్‌లో సింగపూర్‌కు పంపుతున్నారు. మామిడి పండ్లు సింగపూర్‌కి చేరుకోవడానికి 12 రోజుల సమయం పడుతుంది. ఈ 12 రోజుల పాటు మామిడి పండ్లు చెడిపోకుండా ఉండేవిధంగా 12 డిగ్రీల సెల్సియస్‌తో వాటిని జాగ్రత్తగా భద్రపరుస్తారు.రైతుల దగ్గర నుంచి మేలిమిజాతి మామిడి పండ్లను మంచి ధరకే కొనుగోలు చేసినట్లు వ్యాపారులు తెలిపారు. కిలో తోతాపురి రూ. 50, బంగినపల్లి కిలో రూ. 120 చొప్పున కొనుగోలు చేశారు. గత నెల 9న ఐదు టన్నుల బంగినపల్లి మామిడిని సింగపూర్‌కు పంపగా.. రవాణా, ఇతర ఖర్చులు పోనూ కిలోకు రూ. 40 మిగిలిందని తెలిపారు. ప్రస్తుతం కర్ణాటక పరిధిలోని ప్యాక్ హౌస్ నుంచి పంపించాల్సి వస్తుందని.. అదే ప్యాక్ హౌస్ కుప్పం ప్రాంతంలో ఉంటే చిత్తూరు జిల్లా నుంచి విదేశాలకు మంచి మామిడిపండ్లు పంపే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు.




# పరుగులు పెడుతున్న అమరావతి

**విజయవాడ – సూర్య వాస్తవం:** తెలంగాణ ఉద్యమం ప్రాంతీయ ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. ఆ సమయంలో పార్టీల, వర్గాల ఒక లక్ష్యం కోసం కట్టుబడ్డారు. ఆ యుద్ధ భావననతోనే ప్రత్యేక రాష్ట్రం సాధ్యమైంది. ఆంధ్రాప్రాంత ప్రజలు వ్యతిరేకించినా.. తెలంగాణ మొత్తం ఏకమైంది. లక్ష్యం చేరుకుంది. అలాంటి ఐక్యత ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో కనిపించడం లేదు. రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు గడిచినా రాజధాని లేని రాష్ట్రంగానే మిగలిపోయింది. సీఎం చంద్రబాబు నాయుడు రాజధాని అమరావతి కోసం సంకల్పం తీసుకున్నారు. రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారు. రాజధాని నిర్మాణ పనలూ వేగంగా జరుగుతున్నాయి. అయితే ఐదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన జగన్‌మోహన్‌రెడ్డి అమరావతిని వ్యతిరేకించడంతో రాజధానికి అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. రాజకీయ వాతావరణం, వ్యక్తిగత వ్యూహాలు, అధిష్టాన ఉద్దేశాల కారణంగా సమస్య మరింత క్లిష్టంగా మారింది.ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి ఒక బ్రాండ్ తీసుకురావడానికి సీఎం చంద్రబాబునాయుడు అహర్నిలు కష్టపడుతున్నారు. అమరావతి పరపతి మాత్రమే కాదు, హక్కు కూడా. పార్లమెంట్ ద్వారా అమరావతిని రాష్ట్ర రాజధానిగా ధ్రువీకరించి తీర్మానం ఉన్నప్పటికీ, అమరావతి ప్రాధాన్యతను అభివృద్ధి, ఆర్థిక పునర్రూపకల్పన, రైతు సంకల్పంతో కూడిన సామాజిక ఒప్పందంగా చూడాలి. ఎన్నో వేల ఎకరాలు దిగుబడిలేని భూములను రైతులు స్వచ్ఛందంగా ఇచ్చి తమ భవిష్యత్‌కు బాటలు వేసుకున్నారు. ప్రాజెక్టులు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల రూపొందింపు ఈ పట్టదారుల ఆశలపై ఆధారపడి ఉన్నాయి.అయితే రాజకీయంగా పరిస్థితి మరోలా ఉంది. రాష్ట్రపతి స్థాయిలో అమరావతి నిర్ణయాన్ని సైతం మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వ్యతిరేకిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు, అధికారం కోల్పోయిన తర్వాత కూడా రాజధాని నిర్ణయానికి వ్యతిరేకంగా ఉన్నారు. భవిష్యత్‌లో ‘మావిగన్‘ అంటూ కొత్త రాగం ఎత్తుకున్నారు. ఇలాంటి రాజకీయ వ్యతిరేకతలు అమరావతికి ఆటంకంగా మారుతున్నాయి.పార్లమెంటు ఆమోదం ఉన్నా, రాష్ట్ర స్థాయిలో అమలుకు అనేక సాంకేతిక, న్యాయపరమైన అంశాలు ఉన్నాయి. భూమి బదిలీలు, ప్రాజెక్ట్ ఫండింగ్, స్థానిక సంస్థల మంజూరు, వ్యవసాయ పరిష్కారాల అమలు వంటి పనులు అంతులేని కార్యయజ్ఞాలుగా మారతాయి. పెట్టుబడుల ప్రవాహం, మౌలిక వసతుల బహిర్గతత, ప్రభుత్వ లాజిస్టిక్స్ అన్ని సమన్వయం కావాలి. ఇదే సమయంలో రాజకీయ ఆందోళనలు, సహకారంతో కూడని పరిస్థితులు ఈ పనులను ఆలస్యం చేస్తాయి.

అమరావతి నిర్మాణం వలన ఏర్పడే ప్రత్యక్ష ప్రయోజనాలు చాలా స్పష్టంగా కనిపిస్తాయి. స్థానిక ఉపాధి అవకాశాలు, దారిద్ర్య తగ్గింపు, నగరీకరణ ద్వారా సేవల అందుబాటు. అయితే ఈ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఆలస్యాలు, వివాదాలు ఎక్కువితే రైతుల ఆర్థిక భరోసా విచ్ఛిన్నం అవుతుందని భయంకరం. ప్రత్యేకంగా భూములను ఇచ్చిన రైతులు వారి జీవనాధారం మెరుగుపడుతుంది. రైతుల హక్కులు, పునరావాసం, పరిహారం, భవిష్య రక్షణ వంటి అంశాలు చట్టపరంగా భరోసా ఇవ్వాలి.అమరావతి నిర్మాణం ప్రజల ఆశలు, ఆశయాలతో కూడిన సంకల్పం. రాజకీయ ప్రయోజనాల కోసం దీనిని సంక్లిష్టం చేయడం బాధాకరం. రాజధాని ఇబ్బందులను రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటూ రాష్ట్రాన్ని ఇంకా ఎంతకాలం రాజధాని లేకుండా చేస్తారు. ఇప్పటికైనా ప్రజల్లో మార్పు రావాలి. రాజధాని కోసం అందరూ ఏకం కావాలి. తెలంగాణ తరహాల్లో ఐక్యంగా ముందుకు సాగాలి. అమరావతి నిలబడాలంటే నాయకత్వం పారదర్శకంగా, నిబద్ధతతో, ప్రజా ఆశల ప్రకారం ఆచరణలో కనిపించాలి.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో డ్యూయల్ బ్రాండింగ్ రాజకీయం

**ఖమ్మం– సూర్య వాస్తవం :** రాజకీయాల్లో ఎప్పుడు, ఏ రంగులు ఎవరికి అంటు కుంటాయో ఊహించడం ఎవరి తరం కాదు. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ ప్రభు త్వంలో నడుస్తున్న డ్యూయల్ బ్రాం డింగ్ రాజకీయం చూస్తుంటే అలాగే



ఉంటుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ప్రత్యర్థులు ఎప్పుడూ టీడీపీ ఖాతాలోనే వేస్తుంటారు. అదే సమయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కపై వైసీపీ మార్క్ వేయడానికి ట్రై చేస్తుంటారు. అయితే, ఈ పొలిటికల్ ట్యాగ్‌లు కేవలం మాటలకే పరిమితం కాకుండా.. ఇప్పుడు ఏకంగా అధికారిక సభల ఫ్లెక్సీల సాక్షిగా బట్టబయలు కావడం ఖమ్మం జిల్లాలో పెద్ద హాట్ టాపిక్‌గా మారింది.ఖమ్మం జిల్లా జగన్నాథపురంలో నిర్వహించన రైతు ఆశీర్వాద సభ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కలిసి హాజరవుతున్నారు. ఇద్దరూ కలిసి ఒకే వేదికపైకి వస్తుండటంతో, జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు భారీగా ఏర్పాట్లు చేశాయి. అయితే, సభా ప్రాంగణంతో పాటు ఇరువైపులా ఉన్న రోడ్ల పొడవునా వెలిసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు ఇప్పుడు అసలు మ్యాటర్‌ను పక్కనబెట్టి జనాలకు ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇస్తున్నాయి. ఇద్దరు నేతలకు వారి వారి పాత, కొత్త సానుభూతిపరులు వేర్వేరుగా డిజైన్ చేసిన ఫ్లెక్సీలు కట్టడమే ఇందుకు కారణం.ఒకవైపు రేవంత్ రెడ్డికి స్వాగతం పలుకుతూ స్థానిక టీడీపీ సపోర్టర్లు, పాత మిత్రులు పెద్ద ఎత్తున బ్యానర్లు కట్టారు. రేవంత్ రెడ్డి పొలిటికల్ హిస్టరీని గుర్తుచేస్తూ, ఆయనలోని పాత లీడర్‌ను ఓన్ చేసుకునేలా ఈ బ్యానర్లు ఉన్నాయి. ఇక దీనికి పోటీగా.. మరోవైపు భట్టి విక్రమార్కకు మద్దతుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సపోర్టర్లు, వైఎస్సార్ అభిమానులు పోస్టర్లు, ఫ్లెక్సీలు వేసి కలరింగ్ ఇచ్చారు. ఒకే కాంగ్రెస్ ప్రభుత్వంలో నంబర్–1, నంబర్–2 స్థానాల్లో ఉన్న ఇద్దరు నేతలకు.. ఇటు తెలుగుదేశం, అటు వైసీపీ శ్రేణులు పోటీ పడి మరీ ఓన్ చేసుకోవడం చూసి, అసలు అక్కడ జరుగుతోంది కాంగ్రెస్ సభేనా? లేక ఆంధ్రప్రదేశ్ పాలిటిక్స్ ఏమైనా షిఫ్ట్ అయ్యాయా? అని స్థానిక రైతులు ముక్కున వేలేసుకుంటున్నారు.రేవంత్ రెడ్డిని టీడీపీ వాడిగా, భట్టిని వైసీపీ వాడిగా ప్రజలు ముద్ర వేస్తుంటే.. వాటన్నింటినీ భరిస్తూ హస్తం గుర్తు కింద ఇద్దరూ కలిసి పాలిస్తున్నారు. కాస్త ఆలోచిస్తే ఇది కాంగ్రెస్ కు మేలే. అటు టీడీపీ, ఇటు వైసీపీ సానుభూతిపరుల మద్దతు కాంగ్రెస్ కే లభిస్తుంది.

## రాష్ట్రమంత్రి కి వినతి పత్రానికి సమర్పించిన పెన్షనర్లు



**రాయచోటి – సూర్య వాస్తవం:** రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో శనివారం జిల్లా పెన్షనర్స్ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. పెన్షనర్లకు రావలసిన బకాయిలు మరియు మెడికల్ ఎంబర్స్మెంట్ బిల్లుల గురించి,2023 పిఆర్సి గురించి, డిఎ బకాయిల గురించి ఆ వినతి పత్రములో పేర్కొన్నారు. సమస్యలను సావధానంగా మంత్రి ఆలకించి వీలైనంత తొందరలో ముఖ్యమంత్రి చేత సమస్యలకు పరిష్కారరించుటకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. .అలాగే పెన్షనర్ల కుత్వరలోకార్యాలయమునకు సంబంధించి ప్రభుత్వ స్థలమును అందజేస్తామని సుముఖంగా ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమం లో అసోసియేట్ ప్రెసిడెంట్ గుడిబండ శ్రీనివాసులు, తాలూకా ప్రెసిడెంట్ చెంగల్ రెడ్డి, తాలూకా సెక్రెటరీ పి ఈశ్వరయ్య, జిల్లా నాయకులు మేకల రామచంద్ర, అల్లాబకష్, కృష్ణమూర్తి, ఎం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాలలో నేడే మెగా జాబ్ మేళా

### - ప్రిన్సిపాల్ ముండ్లపాటి చంద్రశేఖర్



**బ్రహ్మంగారిమఠం – సూర్య వాస్తవం :** బ్రహ్మంగారిమఠంలోని స్థానిక శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల నందు ఆదివారం నాడు జరిగే మెగా జాబ్ మేళా ను బ్రహ్మం గారిమఠం మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్విని యోగం చేసుకొని వినియోగించుకోగలరని ప్రిన్సిపల్ ముండ్లపాటి చంద్రశేఖర్ పత్రిక ప్రకటనలు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా కళాశాల కరస్పాండెంట్ మాజీ మంత్రివర్యులు డాక్టర్ డి ఎల్ రవీంద్ర రెడ్డి మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ కే వల్లి కళాశాల కమిటీ సభ్యులు ఎస్ఆర్ శ్రీనివాసులురెడ్డి ఆశీస్సులతో కడప లోని కొప్పర్తి నందు నిర్మించిన ప్రముఖ డెక్సన్ కంపెనీ వారితో సంప్రదించి మా కళాశాలలో నేడు మెగా జాబ్ మేల నిర్వహించి బ్రహ్మంగారిమఠం మండల వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశం కల్పించి వారి నిరుద్యోగతను తొలగించాలనే లక్ష్యంతో ఈ జాబ్ మేళా మా కళాశాలలో నిర్వహించడం జరుగుతుందని ఇందుకుగాను 10వ తరగతి ఆ పైన విద్యా అర్హత కలిగిన వారు పాల్గొనవచ్చునని ఈ మెగా జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని ఉద్యోగం పొందిన వారికి ఆకర్షణీయమైన జీతముతో ఉచిత భోజనం వసతి రవాణా సౌకర్యంతో పాటు వైద్య సౌకర్యం కంపెనీవారు కల్పిస్తారని కావున బ్రహ్మంగారిమఠం మండల వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఉద్యోగం పొందగలరని ఆయన తెలిపారు ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు వారి విద్యా అర్హత ధ్రువీకరణ పత్రాలు అలాగే ఆధార కార్డు రెండు ఫోటోలు బ్యాంకు అకౌంట్ జిరాక్స్ తీసుకుని రావాలని వారు తెలియజేశారు

## అడ్డంగా బుక్కైన కాటసాని



**కర్నూలు– సూర్య వాస్తవం :** నంద్యాల జిల్లాలో వైసీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి భూకబ్జా ఉదంతం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తనకున్న రాజకీయ పలుకుబడిని ఉపయోగించి.. ఏకంగా రూ.15 కోట్ల విలువైన 3 ఎకరాల ప్రభుత్వ భూమిని కాటసాని రామిరెడ్డి అక్రమంగా ఆక్రమించుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. నాటి అధికార మదంతో ప్రభుత్వ ఆస్తులను సైతం వదలకుండా కాటసాని అనుచరులు కబ్జాకు పాల్పడ్డారనే విమర్శలు ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి.ఈ భారీ భూకబ్జా పర్వంలో కేవలం రాజకీయ నాయకులే కాకుండా.. ప్రభుత్వానికి రక్షణగా ఉండాల్సిన అధికారులే లంచాలకు ఆశపడి చేతులు కలిపినట్లు తెలుస్తోంది. అప్పట్లో కాటసాని రామిరెడ్డి అక్రమాలకు ఇరిగేషన్ మరియు రెవెన్యూ శాఖలకు చెందిన కొందరు కీలక అధికారులు పూర్తి స్థాయిలో సహకరించారని విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ భూమి అని తెలిసి కూడా రికార్డులను తారుమారు చేయడం లేదా కబ్జా జరుగుతున్నా కళ్లు మూసుకోవడం ద్వారా ఈ అక్రమ ఆక్రమణకు వారు బాటలు వేశారనే ఆరోపణలు వినపడుతున్నాయి.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పలు అవినీతి అక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగానే కాటసాని రామిరెడ్డి చేసిన ఈ భూకబ్జా వ్యవహారంపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, విచారణ జరపగా.. సదరు 3 ఎకరాల ప్రభుత్వ భూమిని కాటసాని ఆక్రమించిన మాట వాస్తవమేనని తేల్చేశారు. విజిలెన్స్ నివేదికతో కాటసాని అక్రమాలు అధికారికంగా బట్టబయలయ్యాయి.విజిలెన్స్ విచారణలో ఆక్రమణలు నిజమేనని తేలడంతో ఏపీ కూటమి ప్రభుత్వం అత్యంత తీవ్రంగా స్పందించింది. రూ.15 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని, ఆక్రమణలను తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. భూకబ్జాకు పాల్పడ్డ వైసీపీ నేత కాటసాని రామిరెడ్డిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు.. అప్పట్లో ఆయనకు అండగా నిలిచి లూటీకి సహకరించిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులపై కూడా శాఖాపరమైన మరియు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

# జిల్లాలో యూరియా కొరత లేదు!

- రైతులకు అవసరమైన మేరకు సమృద్ధిగా నిల్వలు అందుబాటులో ఉన్నాయి
- యూరియా పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక కంట్రోల్ రూమ్
- రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం :** అన్నమయ్య జిల్లాలో రైతులకు అవసరమైన మేరకు యూరియా, డీఏపీ ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, ఎలాంటి కొరత లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ స్పష్టం చేశారు. శనివారం మదనపల్లి కలెక్టరేట్ కోర్టు హాలులో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాల మేరకు గత నెల 8వ తేదీ నుంచి 'ఙూ వ×ూమీ 2.0' యాప్ ద్వారా జిల్లాలో యూరియా, డీఏపీ పంపిణీ జరుగుతోందన్నారు. ఈ వ్యవస్థ ఈ-క్రాప్ (వ-జతీశీజూ) ద్వారా నమోదైన పంట వివరాలు, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రీయ సిఫారసుల ఆధారంగా రైతులకు అవసరమైన ఎరువులను కేటాయిస్తోందని చెప్పారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువుల ప్రణాళికను ముందుగానే సిద్ధం చేసినట్లు తెలిపారు. జూన్ 8, 2026 నుంచిఏపీఏఐఎం 2.0 ద్వారా యూరియా, డీఏపీ పంపిణీ ప్రారంభమైందని చెప్పారు. ఇప్పటివరకు జిల్లాలో 16,056 మంది రైతులకు 1,389.24 మెట్రిక్ టన్నుల యూరియా, 172.60 మెట్రిక్ టన్నుల డీఏపీ పంపిణీ చేసినట్లు వెల్లడించారు. రైతులు యూరియా, డీఏపీ కొనుగోలు చేయడానికి ముందుగా ఈ-క్రాప్‌లో నమోదై ఉండాలని, ఙూూ×మీ మాడ్యూల్‌లో గత రబీ 2025 నాటి ఈ-క్రాప్ వివరాలు ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. రైతులు తమ సమీప రైతు భరోసా కేంద్రం (ఆర్ఎస్‌కే) ను సంప్రదించి ధృవీకరణ పూర్తి చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా ఆర్ఎస్‌కేలు, ప్రైవేట్ రిటైల్ దుకాణాల ద్వారా ఎరువులు అందుబాటులో ఆఉన్నాయని వివరించారు. వర్షాభావ పరిస్థితులు ఉన్న మండలాల్లో ఈ-క్రాప్ నమోదు చేసిన విస్తీర్ణాన్ని ఆధారంగా చేసుకుని రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ పరిమాణం (క్వాంటిటీ) నిర్ణయిస్తున్నామని తెలిపారు. రైతులకు అవసరమైన పరిమాణం కంటే ఎక్కువగా యూరియా లేదా డీఏపీ అందించడం సాధ్యం కాదని, దీనివల్ల ఎరువుల దుర్వినియోగాన్ని నివారించవచ్చన్నారు. పంట మార్పిడి లేదా మాపింగ్ సమస్యల వల్ల ఇబ్బందులు ఎదురైతే రైతులు తమ పరిధిలోని ఆర్ఎస్‌కేలను సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఒకసారి రైతు ఒక పంట కోసం ఎరువులు కొనుగోలు చేసిన తరువాత అదే సీజన్‌లో మళ్లీ అదే పంటకు ఎరువులు ఇవ్వడం సాధ్యం కాదన్నారు. జూన్ నెలలో ప్రారంభించిన "రైతన్న మీకోసం" కార్యక్రమం ద్వారా ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో డీఏపీ కొరత లేదని, మార్క్‌ఫెడ్ వద్ద తగినంత బఫర్ నిల్వలు సిద్ధంగా ఉన్నాయని జాయింట్ కలెక్టర్ తెలిపారు. వర్షాలు ప్రారంభమయ్యే నాటికి అవసరమైన అదనపు నిల్వలు కూడా జిల్లాకు చేరుకుంటాయని చెప్పారు.

అదేవిధంగా జిల్లా స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, ఒక వ్యవసాయ అధికారి (ఙూూ), ఒక సహాయ సంచాలకుడు (ూణ)ను నియమించినట్లు తెలిపారు. రైతులు లేదా డీలర్లు సమస్యలను తెలియజేసిన వెంటనే పరిష్కరించి, వారికి అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా, ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధర (వీఙూ) కంటే అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే యూరియాను నల్లబజారులో విక్రయించడం, అక్రమంగా నిల్వ చేయడం, దుర్వినియోగం చేయడం వంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు సమీప రైతు భరోసా కేంద్రాలు (ఆర్ఎస్‌కేలు) లేదా గుర్తింపు పొందిన ఎరువుల విక్రయ కేంద్రాల్లోనే ఎరువులు కొనుగోలు చేసి, అధికారిక రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ కోరారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు శివన్నారాయణ మాట్లాడుతూ జిల్లాలో రాబోయే రెండు నెలలకు సరిపడా యూరియా, డీఏపీ నిల్వలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. రైతులకు లేదా ఎరువుల విక్రయ కేంద్రాలకు ఙూ వ×ూమీ యాప్‌లో ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించేందుకు ప్రతి రైతు సేవా కేంద్రం, రిటైల్ ఎరువుల విక్రయ కేంద్రంలో సంబంధిత అధికారుల ఫోన్ నంబర్లు ప్రదర్శించినట్లు చెప్పారు. 2025 ఖరీఫ్ ఈ-క్రాప్ నమోదులో ఏవైనా ధృవీకరణ లోపాలు లేదా ఇతర సమస్యలు ఎదురైతే కంట్రోల్ రూమ్ లేదా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రతి సమస్యను వెంటనే పరిష్కరించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పంటల వారీగా రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రీయ సిఫారసుల మేరకే ఎరువుల కేటాయింపు జరుగుతోందని జేడీ వివరించారు. వరి పంటకు అవసరమైన మేరకు దశలవారీగా యూరియా, వేరుశనగ పంటకు హెక్టారుకు ఒక బస్తా యూరియా, రెండు బస్తాల డీఏపీతో పాటు ఇతర పంటలకు కూడా శాస్త్రీయ సిఫారసుల ప్రకారమే ఎరువులు అందిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో ఖరీఫ్‌లో వరి సాగు విస్తీర్ణం సాధారణ స్థాయి కంటే తగ్గే అవకాశముందని తెలిపారు. సాధారణంగా సుమారు 13 వేల హెక్టార్లలో వరి సాగు జరుగుతుండగా, ఈసారి 7,500 నుంచి 8,000 హెక్టార్ల మధ్య సాగు నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు.

రైతులు ఎలాంటి అపోహలకు గురికాకుండా అధికారిక వ్యవస్థ ద్వారా ఎరువులు పొందాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను లేదా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు విజ్ఞప్తి చేశారు.

# ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు కష్టాలు



**తిరుపతి – సూర్య వాస్తవం :** తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు కష్టాలు మొదలయినట్లు కనిపిస్తుంది. వచ్చే ఎన్నికల్లో ఆయనకు తిరుపతి శాసనసభ టిక్కెట్ దక్కేది కూడా కష్టంగానే కనిపిస్తుంది. తెలుగుదేశం పార్టీ నుంచి ఆరణి శ్రీనివాసులకు ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురవుతున్నా యని చెప్పాలి. తాజాగా టీడీపీ అధినాయకత్వం తిరుపతి ఇన్ ఛార్జిగా మన్నెం శ్రీనివాస్ ప్రసాద్ ను నియమించడంతో ఈ ఊహాగానాలకు మరింత ఊపు నిచ్చినట్లయింది. ఇప్పటి వరకూ తిరుపతి టీడీపీ ఇన్ ఛార్జిగా ఉన్న సుగుణమ్మను తప్పించి ఆమె స్థానంలో మన్నెం శ్రీనివాస్ ప్రసాద్ ను నియమించడం వెనక వచ్చే ఎన్నికల్లో శ్రీనివాస్ ప్రసాద్ ను పోటీకి దింపాలన్న యోచనలోనే టీడీపీ నాయకత్వం ఉందన్నది పార్టీ వర్గాల ద్వారా విస్తృతంగా సోషల్ మీడియాలో ప్రచారం అవుతుంది. 2019లా వైసీపీ నుంచి గెలిచిన ఆరణి శ్రీనివాసులు 2024 ఎన్నికల్లో జనసేనలోచేరారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరణి శ్రీనివాసులకు తిరుపతి నియోజకవర్గం టిక్కెట్ ఇచ్చారు. టీడీపీ బలంగా ఉన్నప్పటికీ, అక్కడ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తనకు కావాలని గట్టిగా కోరినప్పటికీ పవన్ కల్యాణ్ తిరుపతి నియోజకవర్గం సీటును పట్టుబట్టి జనసేన ఖాతాలో వేసుకున్నారు కూటమి హవాలో ఆరణి శ్రీనివాసులు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వైసీపీ నుంచి జనసేనలోకి గతంలో చిత్తూరు ఎమ్మెల్యేగా వైసీపీలో ఉన్న ఆయన పార్టీ మారి తిరుపతి జనసేన ఎమ్మెల్యే అయ్యారు. కానీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆరణి శ్రీనివాసులు పార్టీ క్యాడర్ ను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. టీడీపీ, జనసేన క్యాడర్ ను పక్కన పెట్టి కొందరు వైసీపీ నేతలకు టచ్ లో ఉన్నారంటూ ఆరో?పణలు పలు దఫాలు ఎదుర్కొన్నారు. అలాగే సుగుణమ్మ కూడా జనసేన నేతలతో సమన్వయం చేసుకోవడంలో విఫలమయ్యారని టీడీపీ నాయకత్వం భావించింది. జనసేన నాయకులే ఆరణి శ్రీనివాసులుపై ఆరోపణలు చేస్తున్నారు. వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలకు కూడా ధీటుగా ఆరణి శ్రీనివాసులు స్పందించక పోవడం కూడా ఆరణిపై ఆగ్రహానికి కారణమయిందంటున్నారు. కొంతకాలం క్రితం తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ క్లాస్ పీకారని తెలిసింది. ఇలాగైతే ఎలా.. కూటమిలోని మూడు పార్టీల కార్యకర్తలను కలుపుకుని పోవాలని పవన్ కల్యాణ్ చెప్పారట. పాత పరిచయాలుంటే వాటిని వదిలేయాలని, జనసేనలో కొనసాగాలనుకుంటే మారాలని ఆరణి శ్రీనివాసులుకు పవన్ కల్యాణ్ ఒకింత సీరియస్ గానే చెప్పినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే వచ్చే ఎన్నికలు మూడేళ్లకు ముందుగానే టీడీపీ ఇన్ ఛార్జిగా మన్నెం శ్రీనివాస్ ప్రసాద్ ను పార్టీ నాయకత్వం నియమించినట్లు తెలిసింది.

### గ్రేటర్ రాయలసీమపై గురి

జనసేనలో చేరికలు పెరిగే అవకాశం కనిపిస్తోంది. ప్రధానంగా గ్రేటర్ రాయలసీమ పరిధిలోని ఆరు ఉమ్మడి జిల్లాల నుంచి భారీగా వైసీపీ నేతలు జనసేనలో చేరుతారని ప్రచారం ప్రారంభం అయింది. చాలామంది వైసిపి నేతలు అసంతృప్తితో ఉన్నారు. అటువంటి వారంతా జనసేన వైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. వారిని పార్టీలోకి రప్పించేందుకు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి రంగంలోకి దిగినట్లు సమాచారం. ఇటీవల 14 మంది జనసేన నేతలతో చేరికల కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అందులో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి కూడా ఒకరు. ఆయనకు గ్రేటర్ రాయలసీమ జిల్లాలపై మంచి పట్టు ఉంది. కాంగ్రెస్ పార్టీతో పాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆయన పని చేశారు. ఆ అనుభవంతోనే పెద్ద ఎత్తున వైసిపి నేతలను ఆకర్షించేందుకు ఆయన ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు గెలుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై అసంతృప్తి ఉన్నవారు, వీధి లేక పార్టీలో కొనసాగుతున్న వారిని టార్గెట్ చేసుకున్నట్లు తెలుస్తోంది.గ్రేటర్ రాయలసీమ పరిధిలో కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం జిల్లాలో ఉన్నాయి. దాదాపు 70 వరకు నియోజకవర్గాలు ఉంటాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆది నుంచి గ్రేటర్ రాయలసీమ అనుకూలంగా ఉంటూ వస్తోంది. 2014 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వచ్చింది. కానీ గ్రేటర్ రాయలసీమలో మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టు చాటుకుంది. 2019 ఎన్నికల్లో మాత్రం ఒక ఐదు స్థానాలు మినహా మిగిలిన నియోజకవర్గాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మోగించింది. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభంజనంలో సైతం వైయస్సార్ కాంగ్రెస్ ఏడు స్థానాల్లో విజయం సాధించింది. మూడు ఎంపీ సీట్లను పొందింది. అందుకే అక్కడ వైసిపిని తక్కువ అంచనా వేయకూడదని చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. అందుకే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డిని రంగంలోకి దించినట్లు తెలుస్తోంది.బాలినేని శ్రీనివాస్ రెడ్డి తన సొంత జిల్లా ప్రకాశం నుంచి జనసేన చేరికల విషయంలో ప్రత్యేక ఫోకస్ పెట్టినట్లు సమాచారం. జిల్లాలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఓ నలుగురు జనసేనలోకి వస్తారని టాక్ నడుస్తోంది. ప్రధానంగా కరణం బలరాం, సిద్ధ రాఘవరావు, ఆమంచి కృష్ణమోహన్ తో పాటు మరొకరి పేరు ప్రధానంగా వినిపిస్తోంది. వారంతా తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు చేశారు. కానీ వర్కౌట్ కాలేదు. నియోజకవర్గాల పునర్విభజన కచ్చితంగా ఉంటుందన్న టాక్ ఉంది. పెరిగిన అసెంబ్లీ నియోజక వర్గాలతో అవకాశాలు కల్పిస్తామని కూటమి నుంచి వారికి హామీలు దక్కుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా రాయలసీమ జిల్లాల్లో చాలామంది వైసిపి మాజీ ఎమ్మెల్యేలు జనసేనలోకి వచ్చేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జనసేన చేరికల కమిటీ చాలా యాక్టివ్ గా పని చేయడం ప్రారంభించింది. సహజంగానే ఈ పరిణామం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆందోళన కలిగిస్తోంది.



## భాగ్యశ్రీ బోర్సే ..భావోద్వేగం

'లెనిన్'లో అఖిల్‌కు జోడీగా భారతి పాత్రలో నటించి ఆకట్టుకున్నారు నటి భాగ్యశ్రీ బోర్సే. ఈ సినిమా కోసం టీమ్ ఎంతో కష్టపడిందని ఆమె తెలిపారు. తాజాగా ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో భాగ్యశ్రీ మాట్లాడుతూ.. తన అభిమానులు తనను నిరంతరం ప్రోత్సహిస్తూనే ఉన్నారని ఈ చిత్రబృందంతో పాటు వాళ్లందరి వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. హైదరాబాద్ తనకు కర్మభూమి అని చెప్పారు.

## ఓ సుకుమారి ట్రైలర్ విడుదల




'మసూద', 'పరేషాన్' చిత్రాలతో వైవిధ్యమైన నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న తిరువీర్, టాలెంటెడ్ బ్యూటీ ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటించిన లేటెస్ట్ మూవీ 'ఓ సుకుమారి'. భరత్ దర్శన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫీల్ గుడ్ మ్యూజికల్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అధికారిక ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఒక అందమైన గ్రామీణ నేపథ్యంలో సాగే స్వచ్ఛమైన ప్రేమకథ, ఆ తర్వాత వారి జీవితాల్లో వచ్చే మలుపుల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. తిరువీర్ తన మార్క్ సహజ నటనతో ఆకట్టుకోగా, ఐశ్వర్య రాజేష్ మరోసారి నటన ప్రాధాన్యమున్న పాత్రలో మెరిశారు. భరత్ మంచిరాజు అందించిన స్వరాలు, నేపథ్య సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. సున్నితమైన భావోద్వేగాలు, చక్కటి వినోదంతో కూడిన ఈ చిత్రం జూలై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# అఖిల్‌కు హిట్ ఇమ్మని శ్రీవారిని కోరుకున్నా

### లెనిన్ సక్సెస్ మీట్‌లో నాగార్జున

తిరుమల శ్రీవారి దర్శనానికి ఎప్పుడెళ్లినా తాను ఏం కోరుకోనని.. కానీ, ఇటీవల వెళ్లినప్పుడు మాత్రం అఖిల్‌కు మంచి హిట్ ఇవ్వమని కోరుకున్నట్లు నాగార్జున తెలిపారు. అఖిల్ హీరోగా మురళీ కిషోర్ అబ్బూరి తెరకెక్కించిన 'లెనిన్' తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో నాగార్జున మాట్లాడుతూ.. అఖిల్‌కు విజయాన్ని ఇవ్వాలనే ఏకైక లక్ష్యంతో టీమ్ అంతా కలిసి కట్టుగా వర్క్ చేసిందన్నారు. సినిమాకు అడగ్గానే వాయిస్ ఓవర్ ఇచ్చిన మా పెద్దబ్బాయ్ తారక్‌కు ధన్యవాదాలు. సరిగ్గా ఏడాది క్రితం 'తండేల్' సక్సెస్‌మీట్‌కు వచ్చాను. ఇప్పుడు 'లెనిన్' ఈవెంట్.. నాగచైతన్య, అఖిల్ ఇద్దరూ నాకు రెండు కళ్లు. 'లెనిన్' దర్శకుడు మురళీ కిషోర్, ఎడిటర్ నవీన్ ఇద్దరూ పనిరాక్షసులు. భాగ్యశ్రీ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. ఈ చిత్రాన్ని అంగీకరించినందుకు ఆ అమ్మాయికి థాంక్స్ చెప్పాలి. సినిమా విడుదలకు ముందు రోజు రాత్రి భాగ్యశ్రీ ఫోన్ చేసి టెన్షన్ పడింది. తాను ఎంతో కష్టపడుతున్నాననీ కానీ, సరైన గుర్తింపు రావట్లేదని బాధపడింది. 'కష్టానికి తగిన ప్రతిఫలం కచ్చితంగా వస్తుందని చెప్పా. అదే నిజమైంది. ఈ సినిమా విజయంలో నాగవంశీ ముఖ్యపాత్ర పోషించారని టీమ్‌కు థాంక్స్ చెప్పారు. ఇక అఖిల్ గురించి మాట్లాడుతూ.. ఏది అనుకున్నా దాన్ని కచ్చితంగా సాధించాలనే తపన చిన్నప్పటి నుంచి ఉంది. ఎంతో ఎనర్జిటిక్‌గా ఉంటాడు. ఇప్పటి వరకూ ప్రతి సినిమాకు వందశాతం న్యాయం చేశాడు. కానీ, హిట్ కొట్టలేకపోయాడు. 'లెనిన్'తో సరైన హిట్ పడింది. ఈ సినిమాకు ముందు ఒక ప్రమాదంలో అఖిల్ చేతికి దెబ్బతగిలింది. చాలా రోజులు చేయి పనిచేయలేదు. మళ్లీ మాములుగా వస్తుందా లేదా అని అందరం టెన్షన్




పడ్డాం. ఆ సమయంలో అఖిల్‌లో చాలా మార్పు వచ్చింది. దేని గురించైనా నిదానంగా ఆలోచించడం నేర్చుకున్నాడు. అదే సమయంలో పెళ్లి అయింది. వాడికంటూ ఓ తోడు వచ్చింది. గుడ్ టైం ప్రారంభమైందనిపించిందని చెప్పారు. అక్కినేని అభిమానులకు నాగార్జున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మరో ప్రేమ కథాచిత్రం హృదయ మురళి

తమిళ హీరో అథర్వ 'హృదయం మురళి' అనే అనువాద చిత్రంతో బాక్సాఫీస్ బరిలో నిలిచారు. మనసులోని ప్రేమను బయటకు చెప్పలేని హృదయ (అథర్వ) అనే కుర్రాడి కథ ఇది. చిన్నప్పుడే తల్లిదండ్రుల్ని కోల్పోయిన అతణ్ని మామయ్య (నట్టి సుబ్రహ్మణ్యం) అన్నీ తానై పెంచి పెద్ద చేస్తాడు. చిన్నప్పుడు స్కూల్లో తన ఇంగ్లీష్ టీచర్ గీత (జోనితా గాంధీ)పై పుట్టిన అమాయకపు క్రష్ నుంచి.. ట్యూషన్‌లో సమంత (ప్రీతి ముకుందన్).. కాలేజీ రోజుల్లో అముద (కయాదు).. ఇలా హృదయ జీవితంలో వివిధ దశల్లో పలు ప్రేమకథలుంటాయి. ప్రతి ఒక్కర్నీ గాఢంగా ప్రేమించినా.. మనసులోని ప్రేమను వ్యక్తపరచలేకపోతాడు. అయితే అదితి (మాళవిక మోహనన్)తో పెళ్లి పీటలెక్కడానికి పదిరోజుల సమయం ఉందనగా.. తన మనసులో దాగి ఉండిపోయిన ప్రేమని వ్యక్తపరిచేందుకు ఫ్రెండ్స్‌తో కలిసి న్యూయార్క్‌కి బయలుదేరుతాడు హృదయ. మరి ఆ తర్వాత ఏమైంది? సరిగ్గా పెళ్లికి ముందు తన గత ప్రేమ జ్ఞాపకాల్ని వెతుక్కుంటూ హృదయ ఎవరి దగ్గరకి వెళ్లాడు? ఈ ప్రయాణంలో తాను కోరుకున్నట్లుగా నిజమైన ప్రేమని దక్కించుకున్నాడా? సమంత, అముద, అదితిల్లో ఎవరితో కలిసి పెళ్లి పీటలెక్కాడు? అన్నది మిగిలిన కథ. వన్ సైడ్ లవ్‌స్టోరీస్ వెండితెరకు కొత్తేమీ కాదు. అయితే వీటిలో మనసులోని ప్రేమను బయట పెట్టలేక ఒంటరి ప్రేమికులుగా మిగిలిన ప్రేమకథలెప్పుడూ ప్రత్యేకమే. ఈ 'హృదయం మురళి' కూడా ఆ కోవకు చెందిన చిత్రమే.



అయితే దీన్ని 90ల నాటి నోస్టాల్జియా మూమెంట్స్‌తో ముడిపెట్టి.. పాత జ్ఞాపకాల్ని గుర్తు చేస్తూ.. ఈతరం ప్రేక్షకులకూ కనెక్ట్ అయ్యేలా వినోదాత్మకంగా తీర్చిదిద్దిన తీరు ఆద్యంతం అలరిస్తుంది. మనసులోని ప్రేమను బయటకు చెప్పలేని ప్రేమికుడిగా హృదయ పాత్రలో అథర్వ ఒదిగిపోయాడు. ఆద్యంతం చక్కని నటనతో కట్టిపడేశాడు. ప్రీతి ముకుందన్ తెరపై అందంగా కనిపిస్తూనే.. చక్కటి అభినయాన్ని చూపించే అవకాశం దొరికింది. ఆమె పాత్రకి ఇచ్చిన ట్విస్ట్ ఆకట్టుకుంటుంది. అముదగా కయాదు కనిపించినంత సేపూ అలరిస్తుంది. తమన్, నిహారిక, ద్రవిడ్ తదితరుల పాత్రలు కథని ముందుకు తీసుకెళ్లడంలో తమ వంతు పాత్ర పోషించాయి. నేపథ్య సంగీతం సినిమాకి తగ్గట్లుగా కుదిరింది. విజువల్స్, నిర్మాణ విలువలు బాగున్నాయి.



# ఇది కూడా పోయింది..
# చివరి టీ20లోనూ టీమిండియాకు ఓటమే!

**- ఐదో టీ20లోనూ భారత్‌పై ఇంగ్లండ్ ఘన విజయం4-0 తేడాతో టీ20 సిరీస్‌ను కైవసం చేసుకున్న ఇంగ్లండ్**
**- శతకంతో చెలరేగిన కెప్టెన్ బట్లర్, మెరిసిన హ్యారీ బ్రూక్‌పోరాడి ఓడిన టీమిండియా, అర్ధశతకాలు చేసిన ఇషాన్, తిలక్**
**- జూలై 14 నుంచి ఇరు జట్ల మధ్య వన్డే సిరీస్ ప్రారంభం**

ఇంగ్లండ్ పర్యటనలో శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత యువ జట్టుకు ఘోర పరాభవం ఎదురైంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను ఇంగ్లండ్ 4-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. శనివారం జరిగిన నామమాత్రపు ఐదో టీ20లో ఇంగ్లండ్ 56 పరుగుల తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. ఈ పర్యటన ఆరంభం నుంచి తడబడిన టీమిండియా, చివరి మ్యాచ్‌లోనైనా గెలిచి పరువు నిలుపుకుంటుందని భావించినా అది జరగలేదు. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా, మిగిలిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఇంగ్లండ్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. అయితే, అతని నిర్ణయాన్ని ఇంగ్లండ్ బ్యాటర్లు తలకిందులు చేశారు. ముఖ్యంగా జోస్ బట్లర్ (64 బంతుల్లో 131; 12 ఫోర్లు, 8 సిక్సర్లు), కెప్టెన్ హ్యారీ బ్రూక్ (45 బంతుల్లో 95లి; 4 ఫోర్లు, 8 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగారు. భారత బౌలర్లను లక్ష్యంగా చేసుకుని బౌండరీలు, సిక్సర్లతో పరుగుల సునామీ సృష్టించారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు ఏకంగా 233 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో ఇంగ్లండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో



3 వికెట్ల నష్టానికి 257 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత బౌలర్లలో ప్రిన్స్ యాదవ్ 4 ఓవర్లలో 60 పరుగులు, అక్షర్ పటేల్ 4 ఓవర్లలో 63 పరుగులు సమర్పించుకుని అత్యంత ఖరీదైన బౌలర్లుగా నిలిచారు. శివమ్ దూబే ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీసినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. 258 పరుగుల కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియాకు సరైన ఆరంభం లభించలేదు. అభిషేక్ శర్మ (3) త్వరగా ఔటయ్యాడు. అయితే, ఆ తర్వాత వచ్చిన ఇషాన్ కిషన్ (35 బంతుల్లో 56; 7 ఫోర్లు, 2 సిక్సర్లు), తిలక్ వర్మ (25 బంతుల్లో 53; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) అద్భుతమైన అర్ధశతకాలతో జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. సంజూ శాంసన్ (27), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (28) కూడా వేగంగా ఆడినా, కీలక సమయాల్లో వికెట్లు కోల్పోవడంతో లక్ష్య ఛేదన కష్టంగా మారింది. ఇంగ్లండ్ బౌలర్లలో శామ్ కరన్ 3 వికెట్లతో భారత పతనాన్ని శాసించగా, ఆదిల్ రషీద్ 2 వికెట్లు పడగొట్టాడు. దీంతో భారత జట్టు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 201 పరుగులకే పరిమితమై ఓటమిని మూటగట్టుకుంది.



అంతకుముందు, ఐర్లాండ్ చేతిలో సిరీస్ ఓటమిపాలైన టీమిండియాకు... ఇప్పుడు ఇంగ్లండ్ పై ఓటమితో ఈ పర్యటన ఓ పీడకలగా ముగిసింది. ఇరు జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ జూలై 14న ప్రారంభం కానుంది.



## లార్డ్స్ టెస్టులో పట్టుబిగించిన భారత అమ్మాయిలు...
### సొంతగడ్డపై ఇంగ్లండ్ విలవిల

**క్రాంతి గౌడ్ 5 వికెట్లతో చెలరేగడంతో 170 పరుగులకే ఇంగ్లండ్ ఆలౌట్**
**తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌కు 115 పరుగుల కీలక ఆధిక్యం**
**రెండో రోజు టీ విరామానికి వికెట్ నష్టపోకుండా భారత్ 30 పరుగులు**
**మొత్తం 145 పరుగుల ఆధిక్యంతో పటిష్ట స్థితిలో టీమిండియా**

లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో భారత మహిళల జట్టు పట్టు బిగించింది. రెండో రోజు టీ విరామానికి రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 30 పరుగులు చేసిన టీమిండియా, మొత్తం ఆధిక్యాన్ని 145 పరుగులకు పెంచుకుంది. అంతకుముందు, యువ పేసర్ క్రాంతి గౌడ్ (5/37) అద్భుత ప్రదర్శనతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 170 పరుగులకే కుప్పకూలింది. దీంతో భారత్‌కు 115 పరుగుల కీలక తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. లంచ్ విరామం తర్వాత ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌ను ముగించిన భారత్, రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్‌ను ప్రారంభించింది. ఇంగ్లండ్ పేసర్లు లారెన్ బెల్, లారెన్ ఫైలర్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ఓపెనర్లు స్మృతి మంధాన, షఫాలీ వర్మలను పరీక్షించారు. అయితే, ఇద్దరూ సంయమనంతో ఆడి కొత్త బంతి ముప్పును సమర్థంగా ఎదుర్కొన్నారు. ఆరంభంలో నెమ్మదిగా ఆడిన స్మృతి మంధాన, ఆ తర్వాత ఫైలర్ బౌలింగ్‌లో రెండు అద్భుతమైన పుల్ షాట్లతో బౌండరీలు బాది ఒత్తిడిని తగ్గించింది. మరోవైపు, షఫాలీ వర్మ కూడా కుదురుకున్నాక దూకుడు పెంచింది. ముఖ్యంగా స్పిన్నర్ సోఫీ ఎక్సెల్‌స్టోన్ బౌలింగ్‌లో ఒకే ఓవర్‌లో రెండు ఫోర్లు కొట్టి తన ఉద్దేశాన్ని స్పష్టం చేసింది. ఈ ఓవర్లో మొత్తం 13 పరుగులు రావడంతో భారత్ స్కోరు వేగంగా కదిలింది. టీ విరామ సమయానికి స్మృతి (10లి), షఫాలీ (14లి) క్రీజులో ఉన్నారు. ఇద్దరు ఓపెనర్లు క్రీజులో పాతుకుపోవడంతో, ఈ మ్యాచ్‌లో భారత్ పటిష్ట స్థితికి చేరుకుంది. భారీ ఆధిక్యం సాధించి ఇంగ్లండ్‌ను మ్యాచ్ నుంచి పూర్తిగా దూరం చేయాలని టీమిండియా భావిస్తోంది.

సంక్షిప్త స్కోర్లు:
భారత్: 285 ఆ 30/0 (స్మృతి మంధాన 10లి, షఫాలీ వర్మ 14లి)
ఇంగ్లండ్: 170 ఆలౌట్ (అమీ జోన్స్ 52; క్రాంతి గౌడ్ 5/37, సయాలీ సత్ఘరే 2/40)

# కుమార్‌రెడ్డి కుటుంబానికి అండగా ప్రజాప్రతినిధులు

**- మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ పరామర్శ**

**- ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా.. ఆత్మకు శాంతి చేకూరాలని నివాళి**





**పెళ్లకూరు – సూర్య వాస్తవం:** నాయుడుపేట పట్టణానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ డాక్టర్ వి.పి. కుమార్‌రెడ్డి మృతి పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట నియోజకవర్గ మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, నాయుడుపేట ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నాయుడుపేటలోని కుమార్‌రెడ్డి స్వగృహానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుమార్‌రెడ్డి భార్య ప్రతిమ రాజేశ్వరి, కుటుంబ సభ్యులు సునీల్‌కుమార్‌రెడ్డి, ప్రభావతమ్మ, సుధీర్‌రెడ్డి లను ఓదార్చి, ఈ తీవ్ర విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. డాక్టర్ వి.పి. కుమార్ రెడ్డి సమాజ సేవలో, ప్రజా జీవితంలో అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, “ వి.పి. కుమార్‌రెడ్డి మృతి వార్త అత్యంత బాధాకరం. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ అపారమైన దుఃఖాన్ని భరించే ధైర్యాన్ని దేవుడు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను” అని తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కె రామకృష్ణ , తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి పరస రత్నం , నాయుడుపేట పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ, సూళ్లూరుపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జ్ ఉయ్యాల ప్రవీణ్, భారతీయ జనతా పార్టీ నాయకుడు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పేరంశెట్టి శ్రీరాం ప్రసాద్, తెలుగుదేశం పార్టీ నాయకులు కందల కృష్ణారెడ్డి, కే. గోపాల్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి అవధానం సుధీర్, శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, క్లస్టర్ ఇన్‌చార్జి సర్వోత్తమరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కిలారి గోపాలకృష్ణ, నాయకులు జి.వి.ఆర్. నాయుడు, జువ్వలపాటి మస్తాన్, ఇమ్మిడిశెట్టి వెంకటేశ్వర్లు, వాకిరి వెంకటేశ్వర్లు, కాలేషాతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వి.పి. కుమార్‌రెడ్డి మరణం నాయుడుపేట ప్రాంత రాజకీయ, సామాజిక వర్గాలకు తీరని లోటని పలువురు నాయకులు పేర్కొంటూ ఆయన సేవలను స్మరించుకున్నారు.



# డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులంలో

# స్పాట్ అడ్మిషన్లకు సువర్ణావకాశం

**- 2026--27 విద్యా సంవత్సరానికి మిగిలిన సీట్ల భర్తీకి నేరుగా ప్రవేశాలు**

**- జూనియర్ ఇంటర్ బైపీసీ, 6వ తరగతి, 5వ తరగతిలో ఖాళీలు**

**- ప్రిన్సిపల్‌ను నేరుగా సంప్రదిస్తే వెంటనే అడ్మిషన్ -- సీవీ సుబ్బారావు**

**- విద్యార్థుల భవిష్యత్తు కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి**




**నాయుడుపేట– సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లాలోని నాయుడుపేటలో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించినట్లు పాఠశాల మరియు కళాశాల ప్రిన్సిపల్ సీవీ సుబ్బారావు తెలిపారు. తిరుపతి మరియు నెల్లూరు జిల్లాల సమన్వయకర్త డాక్టర్ సి. ప్రభావతమ్మ ఆదేశాల మేరకు ఈ ప్రవేశాల ప్రక్రియ చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ప్రస్తుతం జూనియర్ ఇంటర్మీడియట్ బైపీసీ విభాగంలో 14 సీట్లు,
6వ తరగతిలో 34 సీట్లు,
5వ తరగతిలో 24 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.

ఈ సీట్లను భర్తీ చేసేందుకు అర్హత కలిగిన విద్యార్థులు లేదా వారి తల్లిదండ్రులు నేరుగా గురుకుల ప్రిన్సిపల్‌ను సంప్రదిస్తే, అవసరమైన ధ్రువపత్రాలను పరిశీలించి స్పాట్ అడ్మిషన్ కల్పించనున్నట్లు తెలిపారు. ప్రవేశ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించబడుతుందని, అర్హులైన ప్రతి విద్యార్థికి అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, ఉత్తమ వసతి, పోషకాహారం, అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన వంటి సౌకర్యాలు గురుకులంలో అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపల్ వివరించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన విద్యా, క్రీడా, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆలస్యం చేయకుండా ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పిల్లలకు ఉత్తమ విద్యను అందించేలా వెంటనే గురుకులాన్ని సంప్రదించాలని ప్రిన్సిపల్ సీవీ సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. 2026--27 విద్యా సంవత్సరానికి మిగిలి ఉన్న సీట్లను త్వరితగతిన భర్తీ చేయనున్నందున ఆసక్తి గల విద్యార్థులు వీలైనంత త్వరగా చేరిక ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.

# మత ఘర్షణ కుట్రలకు అంతర్జాతీయ ఫండ్‌పై విచారణ జరపాలి

**- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**



**తిరుపతి– సూర్య వాస్తవం:** రాష్ట్రంలో క్రిస్టియన్స్ ను రెచ్చగొట్టి మత ఘర్షణలను సృష్టించేందుకు వైసీపీ కుట్రలు చేస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాస్ అన్నారు. జోసెఫ్ రావణ్,శ్రావణ్, ప్రకాష్ రాజ్ ల మధ్య ఉన్న క్యాష్ బంధంకు తాడేపల్లి ప్యాలెస్ కు సంబంధం ఉందని ఆయన ఆరోపించారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి కుట్ర నడుపుతున్న వారికి అంతర్జాతీయ ఫండింగ్ అందుతున్నదనే సందేహాలు ఉన్నాయని ఆయన చెప్పారు. క్రైస్తవులను రెచ్చగొట్టి మత ఘర్షణలు రేపేందుకు అంతర్జాతీయ ఫండింగ్ ఎవరికి అందుతోంది అనే కోణంలో పోలీసులు లోతుగా విచారణ చేస్తే కుట్రధారులు, పాత్రధారులు బయటకు వస్తారని ఆయన స్పష్టం చేశారు. తన కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మీడియాతో మాట్లాడారు. రావణ్ గెలుస్తాడంటూ మాజీ మంత్రి అంబటి రాంబాబు విజయవాడ రౌండ్ టేబుల్ సమావేశంలో బహిరంగంగా చెప్పడం మత ఘర్షణల కుట్ర వెనుక వైసిపి హస్తం ఉందని బహిర్గతమైందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. రావణ్ కు మద్దతు పేరుతో సిపిఐ నారాయణ వైసిపికి అండగా పవన్ కళ్యాణ్ పై ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నట్లు ఆయన చెప్పారు. అలాగే ఏబి వెంకటేశ్వర రావు వైసిపితో అంటకాగడం దారుణమని ఆయన అన్నారు. కాగా ఏ యుద్ధంలో అయినా ధర్మమే గెలుస్తుంది వైసిపి కుట్రలో రావణుడు గెలిచే అవకాశమే లేదని ఆయన తెలిపారు. ఏ సినిమాలో అయినా విలన్ మట్టి కరవాల్సిందే... జగన్ అనే విలన్ ను కచ్చితంగా ప్రజలు మళ్ళీ శంకరగిరి మాన్యాలు పట్టించి తీరుతారని ఆయన చెప్పారు. వచ్చే ఎన్నికల్లో11 సీట్ల నుంచి ఒక సీటుకు వైసిపి పడిపోతుందని ఆయన అన్నారు. హిందూమతాన్ని దూషించడం, మావోయిజాన్ని బతికిస్తాను, హింస ఆగదు అంటూ దేశ వ్యతిరేక వ్యాఖ్యలు చేసినందుకు రావణ్ ను ఉపా చట్టం కింద అరెస్ట్ చేశారని ఆయన చెప్పారు. పవన్ కళ్యాణ్ ను దూషించిన కేసుల్లో రావణ్ కు బెయిల్ వచ్చాయని ఆయన గుర్తు చేశారు. దేశ సమగ్రత, సనాతన ధర్మం కోసం బలంగా మాట్లాడుతున్న జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పై కుట్రల వెనుక జగన్మోహన్ రెడ్డే సూత్రధారని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, నగర అధ్యక్షులు రాజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సమాచారంతో పూర్తి చేసిన ఎన్యుమరేషన్

# ఫారాలను బి.ఎల్.ఓ లకు అందజేయండి

**- నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి శారదా దేవి**

**తిరుపతి– సూర్య వాస్తవం:** ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియలో భాగంగా మీకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి బూత్ లెవెల్ ఆఫీసర్లకు అందజేయాలని తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ శారదా దేవి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని కెనడీ నగర్, ప్రకాశం పార్క్, కొర్లగుంట, కృష్ణాపురం ఠాణా తదితర ప్రాంతాల్లోను, సచివాలయాల్లో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియను వీలైనంత త్వరగా రెండు రోజుల్లో. పూర్తి చేయాలని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ఎన్యుమరేషన్ ఫారాలను పరిశీలించి సేకరించాలని తెలిపారు. తగు సమాచారంతో పూర్తి చేసిన చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను బూత్ లెవెల్ ఆఫీసర్లకు అందజేయాలని ప్రజలను కోరారు. పూర్తి చేసి ఇచ్చిన ఫారాలను వెంటనే డిజిటలైజేషన్ చేయాలని సూచించారు. బి.ఎల్.ఓ లు, సిబ్బంది అధికారులతో పరస్పరం సహకరించుకుని ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియను గడువు లోపు పూర్తి చేయాలని తెలిపారు. తద్వారా ఖచ్చితమైన, పాదర్శకమైన ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు వీలుంటుందని తెలిపారు. ప్రజలు కూడా ఈ సర్ కార్యక్రమానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్ఓ లు గుణశేఖర్, మూర్తి, కరుణాకర్, సూపర్ వైజర్లు, బూత్ లెవెల్ ఆఫీసర్లు, తదితరులు ఉన్నారు.

## జూలై 15 నుంచి శ్రీ శక్తి పీఠంలో

# శ్రీ వారాహి దేవి నవరాత్రి మహోత్సవాలు...



**తిరుపతి– సూర్య వాస్తవం:** తిరుపతి రాయలచెరువు సమీపంలోని శ్రీ శక్తి పీఠంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని శ్రీ వారాహీ దేవి నవరాత్రులు మహోత్సవాలు ఈ నెల జూలై 15 వ తేదీ నుండి 25 వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు పీఠం మేనేజర్ ప్రసాద్, మహిళా విభాగం ఇన్చార్జి మాధవి తిరుమలరెడ్డి తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. సిద్ధేశ్వరానంద భారతీ మహా స్వామీజీ ఆశీస్సులతో, మంత్ర మహేశ్వరి శ్రీ శక్తి పీఠాధీశ్వరి రామ్యానంద భారతి స్వామిని ఆధ్వర్యంలో జూలై 15 నుంచి శ్రీ శక్తి పీఠంలో శ్రీ వారాహి దేవి నవరాత్రులు మహోత్సవాలు అత్యంత వేడుకగా జరగనున్నాయని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, అలంకార సేవలు, దేవి ఉపాసన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తుల సంక్షేమం, కుటుంబ శాంతి, ఆరోగ్యం, ఐశ్వ ర్యం, వ్యాపారాభివృద్ధి, శత్రు నివారణ, దుష్టశక్తుల నివారణ కోసం ప్రత్యేకంగా శ్రీ వారా హి దేవి ఆరాధన నిర్వహించబడుతుందని నిర్వాహకులు వెల్లడించారు. మహో త్సవాల సందర్భంగా పాల్గొనే భక్తులకు ప్రత్యేక దర్శన సౌకర్యాలు, ప్రసాద వితరణతో పాటు ఆధ్యాత్మిక ప్రవచనాలు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పవిత్ర కార్యక్ర మాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అనుగ్రహాన్ని పొందాలని పీఠాధికా రులు ఆహ్వానించారు. ఈ సమావేశంలో శక్తిపీఠం మీడియా ఇన్చార్జి యుగంధర్ పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఫుట్ పెట్రోలింగ్

**- జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు విస్తృత తనిఖీలు.**

**- నేరాల నియంత్రణ, ప్రజలకు భరోసా కల్పించడమే లక్ష్యం.**

**- అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక తనిఖీలు.**

**- ప్రజలతో మమేకమై భద్రతా సూచనలు -- అత్యవసర సేవలపై అవగాహన.**

**తిరుపతి– సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా “ఆపరేషన్ నైట్ డామినేషన్”లో భాగంగా పోలీస్ అధికారులు, సిబ్బంది విస్తృత స్థాయిలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారులు, కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, వాణిజ్య సముదాయాలు, కాలనీలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా పెట్రోలింగ్ చేపట్టి, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను తనిఖీ చేశారు. నేరాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచి, శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టారు. పెట్రోలింగ్ సందర్భంగా ప్రజలతో మమేకమై స్థానిక సమస్యలను తెలుసుకొని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-112కు సమాచారం అందించాలని సూచించారు. మహిళలు, చిన్నారుల భద్రత, ట్రాఫిక్ నియమాల పాటింపు, సామాజిక బాధ్యతలపై కూడా అవగాహన కల్పించారు. తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇలాంటి నైట్ డామినేషన్ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తుందని, ప్రజలు పోలీస్ శాఖకు సహకరిస్తూ అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.




PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )